



# ఈనాడు

## మహబూబాబాద్

సోమవారం 1 జనవరి 2018 | 16 పేజీలు


కాలచక్రం రివ్వున తిరిగింది. చూస్తుండగానే ఏడాది గడిచిపోయింది.. ఎన్నో అనుభూతులను మిగిల్చి.. మరెన్నో లక్ష్యాలను సాధించిపెట్టి.. ఇంకెన్నో ఆశయాలను తీర్చి.. కాలగర్భంలోకి **2017 చల్లగా జారుకుంది...**

**కొత్త నేస్తమా 2018..** కోటి ఆశలతో స్వాగతం.. సుస్వాగతం.. చీకటి మబ్బులు వీడి దేదీప్యమాన కాంతులు విరజిమ్మాలి. ప్రతి ఉషోదయం ఓ మహోదయం కావాలి. నవోదయం వికసించాలి. ఇంటింటా ఆనందాల ఆశల హరివిల్లు పరుచుకోవాలి. కర్షక, కార్మిక, ఉద్యోగ, వ్యాపార, యువ, మహిళల ఆశలు, ఆశయాలు ప్రతిఫలించాలి.

# మురవాలి.. మెరవాలి..

- ఆలోచనలు వికసించాలి.. ఆచరణలు ఫలించాలి
- కోటి ఆశలతో కొత్త వత్సరానికి స్వాగతం

2018

**ఈనాడు డిజిటల్, మహబూబాబాద్**

.. వరుణుడు కరుణించాలి.. అన్నదాతలకు సిరులు కురిపించాలి.. రైతు.. రారాజు అని వినిపించాలి.. అబల.. సబల' అని చాటాలి.. ఆదిశక్తివై.. కీచకుల భరతం పట్టాలి.. యువతకు విజయాలు దరిచేరాలి.. ఈ నూతన సంవత్సరాది అందరికి కావాలి.. శ్రీకరం.. శుభకరం

కాలం అందరిది..కానీ ఎవరికోసం ఆగదు..అర్థక్షణం గడిస్తే..అదే అర్ధశతాబ్దితో సమానం అని మహాకవి అన్నట్లు.. కాలానికి తగ్గ వేగంతో కదిలితేనే లక్ష్యాలను సాధించగలం. ఆలోచనలు వికసించాలి.. ఆచరణలు ఫలించాలి. కొత్త జిల్లాల అభివృద్ధికి అన్నివర్గాలు సమేకమై పునరంకితం కావాలి. పిడికిలి లాంటి ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ **మిగతా 2లో...**




# స్వచ్ఛ జిల్లా లక్ష్యం




-పాలనాధికారి డాక్టర్.ప్రీతిమీనా

**ఈనాడు డిజిటల్, మహబూబాబాద్**

కాలచక్ర గమనంలో మరో మైలురాయిని అందుకునేందుకు పయనం.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా పాలనాధికారులది కీలకపాత్ర. 2018కి స్వాగతం పలుకుతూ, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ ప్రీతిమీనా, ఎస్పీ కోటిరెడ్డి ప్రాథమ్యాల గురించి 'ఈనాడు' ప్రశ్నించగా. వారు స్పందించారు. ' జిల్లాను అక్టోబర్ నాటికి బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని లక్ష్యాన్ని పెట్టుకున్నాం. మండలాల **మిగతా 2లో...**





## ప్రతిభ

అనివార్య కారణాల వల్ల ఈరోజు ప్రతిభ పేజీలు ఇవ్వలేకపోతున్నాం



## నయా జోష్..

కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆదివారం అర్ధరాత్రి సంబురాలు చేసుకున్నారు. యువత కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. 11లో...



# మురవాలి.. మెరవాలి..

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు నిర్విఘ్నంగా పూర్తి కావాలి. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టాలి. సస్యానుకూల వర్షాలు కురవాలి, 24 గంటల కరెంటుతో సాగు మురవాలి. మిషన్ భగీరథ జలాలు పల్లెబాట పట్టాలి. ఇంటింటికి తాగునీరివ్వాలనే లక్ష్యానికి అనుగుణంగా ఐదు జిల్లాల్లో పనులు పూర్తి చేసేందుకు అధికారులు నడుం బిగించాలి. పచ్చని, స్వచ్ఛమైన పరిసరాలు, పల్లెలు, పర్యావరణం లక్ష్యంగా చేపట్టిన హరితహారం వికసించాలి. నాటిన మొక్కలు ఏపుగా ఎదిగేలా చేయిచేయి కలపాలి. గ్రామాలన్నీ స్వచ్ఛ పల్లెలుగా మారి.. స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛభారత్ ఆశయాన్ని నిజం చేయాలి. ఆత్మగౌరవం, పర్యావరణ హితంతో ముడిపడిన ఓడీఎఫ్ సాధనకు వేసిన తొలి అడుగులు.. లక్ష్యం చేరుకోవాలి. పేదలకు సొంతింటి కల నిజం చేసే జంట పడక గదుల ఇళ్ల పనులు పూర్తయి.. గృహప్రవేశాలు జరగాలి. బడి ఈడు పిల్లలు బళ్లలోకి వెళ్లాలి. అక్షర సుమాలు విరబూయాలి. యువతలో విజ్ఞానం వికసించి..సరికొత్త ఆలోచనలతో.. కొత్త ఆవిష్కరణలకు నడుం కట్టాలి. సర్కారు కొలువుల అవకాశాన్ని వినియోగించుకుంటూనే, స్వయం ఉపాధికి బాటలు వేసుకోవాలి. హక్కుల సాధనతో పాటు, బాధ్యతలను గుర్తించేలా పౌర స్పృహ వెల్లివిరియాలి. గ్రామ ప్రజాప్రతినిధుల గడువు ముగియబోతోంది. చట్టసభల ప్రజాప్రతినిధులకూ గడువు ముంచుకొస్తోంది. చేసింది ఎంతో, చేయాల్సింది ఏమిటో బేరీజు వేసుకుని ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేందుకు కంకణ బద్ధులు కావాలి. 'మంచి ఆలోచనే మంచి ఆచరణకు మూలం.' అందుకు ఇదే సరైన సమయం. నిన్నను మననం చేసుకుంటూ..నేటిని సద్వినియోగం చేసుకుంటూ.. రేపటి కొత్త బంగారు లోకాన్ని సృష్టించుకుందాం' అందుకే కొత్త సంవత్సరానికి కొంగొత్త ఆలోచనలతో.. ఆశయాలతో స్వాగతం..సుస్వాగతం..

# స్వచ్ఛ జిల్లా లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

వారీగా ప్రత్యేక అధికారుల్ని కేటాయించి మరుగుదొడ్ల పనుల్ని వేగవంతం చేశాం. అనుకున్న లక్ష్యాన్ని గడువులోపే అందుకుంటాం. అలాగే జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్నారు. అక్షరాస్యత శాతాన్ని కూడా పెంచుతాం. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా తగిన చర్యలు తీసుకుంటా. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒకరికి అందిస్తున్నాం. సర్కారు ఇటీవల చేపట్టిన భూప్రక్షాళన 87శాతం అయింది. వివాదస్పదంలో ఉన్న భూముల ప్రక్షాళనను కూడా రెండో విడతలో పూర్తి చేస్తాం.

### స్నేహపూర్వక పోలీసింగ్ అమలు: కోటిరెడ్డి, ఎస్పీ



జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయి. ఇందుకోసం స్నేహపూర్వక పోలీసింగ్ విధానంతో ముందుకుపోతున్నాం. 2017లో సాధించిన జయాపజయాలను అవలోకనం చేసుకుని 2018లో పోలీస్ సేవల్ని మెరుగుపరుస్తాం. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూస్తాం. ప్రజలతో మమేకం అవుతున్నాం. ప్రభుత్వ పథకాలు పక్కదారి పట్టకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. పోలీస్ ఉద్యోగాల కోసం కసరత్తు చేసే అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్‌ను అందిస్తున్నాం. 2018లో హైదరాబాద్‌లోని పేరున్న కంపెనీల ప్రతినిధులను జిల్లాకు రప్పించి నిరుద్యోగుల కోసం ఉద్యోగ మేళాను నిర్వహిస్తాం.

# కొత్తపొద్దు పొడవాలి

● ప్రజల మోముల్లో ఆనందం వెల్లివిరియాలి

–న్యూస్‌టుడే, భూపాలపల్లి టౌన్

**ఎన్నో పోరాటాలతో సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రజలకు సమస్యలు తప్పడం లేదు. 2017లో చాలా సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి.. కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టాం. ప్రజలు కోరుకుంటున్న వాటిని నెరవేర్చితే ఐదు జిల్లాలు అభివృద్ధి దిశగా పయనిస్తాయి. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోంది. వరంగల్ అర్బన్ జిల్లాలో విమానాశ్రయం, కాజిపేట రైల్వే డివిజన్ ఏర్పాటు.. ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణాలతో వరంగల్ పట్టణం మెట్రోసిటీగా మారుతుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాను పర్యాటకంగా చాలా వేగవంతంగా అభివృద్ధి చేయవచ్చు. దేవాదుల, కాళేశ్వరం ప్రాజెక్టలను పూర్తిచేసి కరవు ప్రాంతమైన జనగామ జిల్లాను సస్యశ్యామలం చేయవచ్చు. మహబూబాబాద్ జిల్లాలోని గిరిజనులకు అన్ని వసతి సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధిలోకి తీసుకురావచ్చు. వరంగల్ రూరల్ జిల్లాను వ్యవసాయ జిల్లాగా మార్చవచ్చు. కొత్త సంవత్సరంలోనైనా కొత్త పొద్దు పొడవాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా ముందుకు సాగాలి. ప్రజలు ఎదుర్కొంటున్న ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ వెళ్లాలి. 2018లో విఘ్నాలన్ని తొలగి కొత్తపొద్దు పొడవాలని ఆకాంక్షిస్తూ 'న్యూస్‌టుడే' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇదీ..!**

## ఇవి నెరవేరాలి



### దేవాదుల

వరంగల్, కరీంనగర్, నల్గొండ జిల్లాలను వ్యవసాయ కల్పతరువుగా మారుస్తామంటూ గత ప్రభుత్వం జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల వద్ద 2004లో మొదటి దశ పనులకు అంకురార్పణ జరిగింది. మొత్తం మూడు దశల్లో పనులు పూర్తిచేయడానికి రూ.13 వేల కోట్లు అంచనా వేయగా ఇప్పటికి రూ.9 వేల కోట్లు ఖర్చుచేశారు. 5.43 లక్షల ఎకరాలకు నీరందిస్తామని చెప్పిన అధికారులు 60 శాతంకు పైగా నిధులు ఖర్చుచేసినా 50 వేల ఎకరాలకు కూడా నిరందివ్వడం లేదు. గడిచిన పదమూడేళ్లలో ఇప్పటికే రూ.7 వేల కోట్లు అంచనా మొత్తం పెంచారు. అయినా పనులు మాత్రం పూర్తిచేయడం లేదు. పనులు పూర్తిచేయడానికి 15 సార్లు గడువు పెంచారు తప్ప రైతులకు సాగునీరు అందివ్వడంలో విఫలమయ్యారు. ఈ ఏడాదైనా పనులను పూర్తిచేస్తే పది జిల్లాల రైతుల సాగునీటి, లక్షలాది మంది ప్రజల తాగునీటి కష్టాలు తీరుతాయి.

### కాజిపేట రైల్వే డివిజన్




కాజిపేట రైల్వే డివిజన్ అనేది ఐదు జిల్లాల ప్రజల చిరకాల వాంఛ. తెలంగాణ రాష్ట్రంలో సికింద్రాబాద్ తర్వాత రైల్వే డివిజన్ ఏర్పాటు చేయడానికి కాజిపేటలో అనువైన పరిస్థితులు, వనరులు ఉన్నాయి. ఇది నెరవేరితే ఇక్కడినుంచే రైళ్ల రాకపోకలు ప్రారంభమవుతాయి. వేలాదిమంది ప్రయాణికులకు, రైల్వే ఉద్యోగులకు చాలా అనువుగా ఉంటుంది.



### అంతర్జాతీయ విమానాశ్రయం

భారతదేశానికి స్వాతంత్య్రం రాక పూర్వం వరంగల్‌లో విమానాశ్రయం ఉండేది. ఇది మూడున్నర దశాబ్దాలుగా మూతపడి ఉంది. దీనికి సంబంధించిన 775 ఎకరాల భూమిలో కొంత ఇప్పటికే కబ్జారాయుళ్ల చేతుల్లోకి వెళ్లింది. ఈ భూమిని తిరిగి రాబట్టడంతో పాటు ఇంకా 427 ఎకరాల భూసేకరణ జరిపి ఏయిరిండియా అథారిటికి అప్పగిస్తే విమానాశ్రయం తిరిగి పునరుద్ధరిస్తామని కేంద్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి విమనాశ్రయం ఏర్పాటు చేస్తామంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఇటీవల ప్రకటించారు. వరంగల్‌లో మళ్లీ విమానాలు తిరిగితే చూడాలని చాలామంది కలలు కంటున్నారు.

### రెండు పడకగదుల ఇళ్లు



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాలకు కలిపి మొత్తం 14 వేలకు పైగా రెండు పడక గదుల ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు భూపాలపల్లి నియోజకవర్గంలో 188, ములుగు నియోజకవర్గంలో 67 మాత్రమే పూర్తయ్యాయి. మరెక్కడా పూర్తి కాలేదు. ఈ పథకం అమలు సరిగా లేదు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు ఉన్నాయి. గ్రామాల్లో ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఏడాదైనా ఇళ్ల పనులు పూర్తి చేసి. . లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించాలి. ఈ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి కదలాలి.



### మిషన్ భగీరథ


ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. ఐదు జిల్లాలలో కలిపి రూ.వెయ్యి కోట్లకు పైగా ఖర్చుచేస్తోంది. అయినా ఇప్పటివరకు కేవలం జనగామ జిల్లా వాసులకు మాత్రమే మిషన్ భగీరథ నీళ్లు అందాయి. జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్ జిల్లా వాసులకు కూడా ఈ ఏడాది మిషన్ భగీరథ నీళ్లు అందాలని ప్రజలంతా భావిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ పథకంపై ప్రత్యేక దృష్టి సారిస్తే తప్పకుండా నీరు అందడం ఖాయం.

### టెక్స్‌టైల్ పార్క్



టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు 2017లో అంకురార్పణ జరిగింది. వరంగల్ రూరల్ జిల్లా గీసుగొండ మండలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. 22 కంపెనీలతో ఒప్పందాలు కూడా చేసుకున్నారు. ఇది ఏర్పాటైతే మరమగ్గ, చేనేత కార్మికులతో పాటు ఇంకా వేలాది మందికి పనిదొరకుతుంది. వేలాది కుటుంబాల జీవనభృతికి ఆధారమైన టెక్స్‌టైల్ పార్క్ పనులు ఈ ఏడాదిలో పూర్తయి ఇక్కడ వస్త్ర ఉత్పత్తి పనులు మొదలు కావాలని నేతన్నలు అభిలషిస్తున్నారు.

### ఔటర్‌రింగ్ రోడ్డు



తెలంగాణ రాష్ట్రంలో వరంగల్ పట్టణం రెండో రాజధానిగా పేరొందింది. హృదయ్, స్మార్ట్‌సిటీ, అమృత్ పథకాల కింద వరంగల్ నగరం ఎంపికైంది. వరంగల్, హన్మకొండ, కాజిపేటలను కలుపుతూ నగరం చుట్టూ ఔటర్‌రింగ్ రోడ్డు ఏర్పాటుచేయాలని చాలా ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారు. సర్వేలు కూడా జరిగాయి. ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వడానికి కూడా సుముఖంగా ఉన్నాయి. ఈ ఏడాది అయినా అన్ని విఘ్నాలు తొలగిపోయి రింగ్ రోడ్డు నిర్మాణం జరగాలని ప్రజలందరి కోరిక.

## ఇవి కావాలి

### సాఫ్ట్‌వేర్ కంపెనీలు



ఐదు జిల్లాలలో ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ వంటి ఉన్నత చదువులు చదివిన వారు వేలల్లో ఉన్నారు. చాలా మంది తమ ఉద్యోగ రిత్యా చెన్నై, ముంబయి, హైదరాబాద్ తదితర నగరాలకు వెళ్తున్నారు. ఇంకా చాలామంది ఉద్యోగ అవకాశాలు దొరకక ఖాళీగా ఉంటున్నారు. రాష్ట్రంలో రెండో రాజధానిగా కీర్తించబడుతున్న వరంగల్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఈ కంపెనీల ఏర్పాటుకు అవసరమైన వనరులు కూడా ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. వరంగల్- హైదరాబాద్ రహదారిని ఆనుకొని సాఫ్ట్‌వేర్ కంపెనీలను ఏర్పాటుచేస్తే వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించవచ్చు. సాఫ్ట్‌వేర్ కంపెనీలకు అనుబంద కంపెనీలు కూడా వెలిసే అవకాశం కూడా ఉంటుంది.

### పరిశ్రమలు



వరంగల్ రూరల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ అర్బన్, జనగామ జిల్లాలు ఖనిజ సంపదకు పెట్టింది పేరు. ఐరన్‌ఓర్, గ్రానైట్ నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయి. గడిచిన ఏడేళ్లలో ప్రభుత్వ పరంగా ఉద్యోగం పొందినవారు ఐదు వేలకు మించిలేరు. ప్రతి సంవత్సరం 22 వేల మంది పట్టభద్రులు, 4 వేలకు పైగా ఇంజినీరింగ్ పూర్తి చేస్తుంటే ఉద్యోగాలు మాత్రం పదుల సంఖ్యలోనే దక్కుతున్నాయి. నిరుద్యోగులకు అనుగుణంగా ఏవైనా పరిశ్రమలు ఏర్పాటుచేస్తే చాలా మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయి.

### మేడారం జాతరకు జాతీయ హోదా



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. మేడారంలో 4 రోజుల పాటు జరిగే ఈ జాతరకు కోటిమందికి పైగా భక్తులు వస్తుంటారు. తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు. రెండేళ్లకోసారి జరిగే మహా జాతరను ఇప్పటికే రాష్ట్ర పండుగగా గుర్తించారు. మళ్లీ ఈ ఏడాది జనవరి-ఫిబ్రవరి మాసంలో జాతర జరగబోతుంది. ఈ నేపథ్యంలో మేడారం ఉత్సవానికి జాతీయ హోదా కల్పిస్తే కేంద్రం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. ఇంకా జాతరను అభివృద్ధి చేసుకునే అవకాశం దక్కుతుంది.

**ఉమ్మడి జిల్లాలో చదువుతున్న వారు..**

డిగ్రీ కోర్సులు **87** వేల మంది

ఇంజినీరింగ్ **26** వేలు

ఫార్మసీ : **5** వేలు

ఎంబీఏ : **2500**

పీజీ కోర్సులు **3500**

విద్యా కోర్సులు **3000**

ఎంసీఏ, వైద్య విద్య తదితర కోర్సులు **10** వేలు

నిన్నటి సూర్యుడే నేడు.. నిన్నటి చంద్రుడే నేడు.. కానీ ఈ రోజు కొత్త క్యాలెండర్.. కొత్త సంవత్సరం. నూతన ఆశయాలు. మరెన్నో ఆశలు.. ఈ సంవత్సరంలో ఉత్తమ ర్యాంకులు రావాలని కొందరు... మంచి ఉద్యోగం దొరకాలని మరి కొంతమంది.. ఉద్యోగమేమో కానీ కనీసం ఏదైన ఉపాధి అవకాశాలు రావాలని ఇంకొందరూ.. ఇలా వారి వారి కోరికలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నారు ఉమ్మడి జిల్లాలోని యువతరం. ఉమ్మడి జిల్లాలోని మొత్తం జనాభాలో 50 శాతానికిపైగా ఉన్న యువత కొత్త సంవత్సరంపై కోటి ఆశలు పెట్టుకున్నారు. వివిధ వయసులకు చెందిన యువతరం తమ ఆశలు నెరవేరాలని కోరుకుంటున్నారు.. 20-25 ఏళ్ల మధ్య ఉన్న యువత ఎక్కువగా ఉన్నత విద్యలో ప్రతిభ చూపాలని, 25-30 ఏళ్ల మధ్య వారు మంచి ఉద్యోగం సాధించాలని అనుకుంటుండగా, 30-35 ఏళ్ల వారు మాత్రం ఏదైన చేసి జీవితంలో స్థిరపడాలని ఆరాటపడుతున్నారు. ఒక్కో విభాగంలో మూడు లక్షల వరకు యువత తమ ఆశలు నెరవేరాలని కోరుకుంటుంది. ఈ సందర్భంగా వివిధ వయసులకు సంబంధించి యువతరం ఈ సంవత్సరంలో వారు కోరుకుంటున్న అంశాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం. – విద్యానగర్, న్యూస్‌టుడే



# ఆశలు.. 2017 ఆశయాలు..! 2018

● ఈ ఏడాదైనా నెరవేరేనా? ● నూతనోత్సాహంతో అడుగిడుతున్న యువత

## ఉన్నత విద్యలో ప్రతిభ చూపాలని..

**20–25 ఏళ్లు..**

● ఈ వయసులో చూపే ప్రతిభా పాటవాలు జీవితంలో అత్యున్నత స్థాయికి తీసుకుపోతాయి. అందుకే ఈ కొత్త సంవత్సరంలో అనేక విజయాలు సొంతం కావాలని కోరుకుంటున్నారు. వీరిలో చాలామంది ఈ సంవత్సరంలో మంచి మార్కులతో చదువుతున్న కోర్సును పూర్తి చేయడంతోపాటు ఉన్నత చదువులకు సంబంధించి అత్యుత్తమ కళాశాలలో సీటు రావాలని కోరుకుంటున్నారు.

● ముఖ్యంగా బీటెక్ చివరి సంవత్సరం చదివే వారు గేట్‌లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీ, ఎన్ఐటీలో సీటు రావాలని అనుకుంటున్నారు.

● బీ ఫార్మసీ విద్యార్థులేమో ఈ ఏడాది జరిగే జీ ప్యాట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకు రావాలని కోరుకుంటున్నారు.

● ఇక డిగ్రీ చివరి సంవత్సరం చదివే విద్యార్థులు మాత్రం జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థల్లో పీజీ సీటు వచ్చి తమ భవిష్యత్తు మారాలని అనుకుంటున్నారు.

● ఉన్నత విద్యలో ఈ సంవత్సరం నుంచైనా నాణ్యత ప్రమాణాలు, ఆధునిక సౌకర్యాలు మెరుగు అవ్వాలని తపిస్తున్నారు.

● మేనేజ్‌మెంట్ విద్య కోర్సులు అందించే ప్రముఖ విద్యాసంస్థగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఐఐఎం ఈ సంవత్సరంలోనైనా వరంగల్‌లో ఏర్పాటు కావాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. ఈ విద్యాసంస్థ కోసం మూడేళ్లుగా ఎదురుచూపులు తప్పడంలేదు. ఆ కల ఈ సంవత్సరం తీరాలని విద్యార్థులు అనుకుంటున్నారు.

● మరి కొంతమంది మాత్రం ప్రత్యేకించి ఇంజినీరింగ్ కోర్సులు చదివే వారు ఈ సంవత్సరంలో మంచి ఐటీ సంస్థలో ఉద్యోగం రావాలని కోరుకుంటున్నారు.

## ఉద్యోగం రావాలని...

**25–30 ఏళ్లు..**

● వీరు వివిధ కోర్సులు పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. గతేడాది రాని ఉద్యోగం ఈ ఏడాది రావాలనుకుంటున్నారు.

● ప్రస్తుతం ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం విడుదలైన టీఆర్‌టీ కోసం ఉమ్మడి జిల్లాలో 40 వేలకు పైగా అభ్యర్థులు పోటీపడును న్నారు. ఇప్పటికే పరీక్షలు పూర్తయిన గురుకులాల టీజీటీకి సంబంధించి ఫలితాలు కొత్త సంవత్సరం తొలి నెలలోనే పూర్తి స్థాయి ఫలితాలు విడుదల కావాలని ఆ ఉద్యోగాల కోసం ధ్రువపత్రాల పరిశీలనకు వందలాది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

● ఈ సంవత్సరంలో గ్రూప్ -1, 2, 4 నోటిఫికేషన్లు, జేఎల్, ఎస్ఐ, కానిస్టేబుల్, గురుకుల ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులతోపాటు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక నోటిఫికేషన్లు విడుదల కావాలని 2018 సంవత్సరం ఉద్యోగ నామ సంవత్సరం కావాలని ఉమ్మడి జిల్లాలో వివిధ కోర్సులు పూర్తి చేసిన 3 లక్షల మంది ఎదురుచూస్తున్నారు.

● వరంగల్‌లో ఇప్పటికీ ఒక్క పెద్ద పరిశ్రమ కూడా లేదని ఆ లోటు ఈ సంవత్సరంలోనైనా తీరాలని చూస్తున్నారు. టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తి ప్రారంభమై ఉద్యోగ అవకాశాలు లభించాలని పలువురు కోరుకుంటున్నారు.

## ఉపాధి అవకాశాలు దరిచేరాలని...

**30–35 ఏళ్లు..**

● వివిధ కోర్సులు పూర్తి చేసి కొన్నేళ్లుగా ఉద్యోగ ప్రయత్నాలు చేసి చేసి అలిసిపోయిన వారు ఉమ్మడి జిల్లాలో లక్షల్లో ఉన్నారు.

● ఈ కొత్త సంవత్సరంలోనైనా ఏదో రంగంలో ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావాలని వారు కోరుకుంటున్నారు. తమకు ఉపాధి అవకాశాలు దొరికేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరుకుంటున్నారు.

● ఇప్పుడైనా జీవితంలో సరిగా స్థిరపడకపోతే భవిష్యత్తులో అనేక కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● ప్రభుత్వ ఉద్యోగం కోసం చదివే ఓపికగానీ, ఇప్పుడు ఉన్న పోటీనిగానీ తట్టుకునే స్థాయి తమకు లేదని వారంటున్నారు. అందుకే చాలామంది స్వయం ఉపాధి రంగం వైపు చూస్తున్నారు.

● బ్యాంకులు రుణ సౌకర్యాన్ని కల్పించి ఆదుకోవాలని వారు అంటున్నారు.

● నిరుద్యోగులకు ఉపయోగపడే పథకాలను ప్రభుత్వాలు తీసుకురావాలని కోరుకుంటున్నారు.

● కొన్ని రాష్ట్రాల్లో ఇచ్చినట్లుగా నిరుద్యోగ భృతిని ఇస్తే తమకు ఆసరాగా ఉంటుందని చెబుతున్నారు.

# భక్తిశ్రద్ధలతో దృష్టికుంభం

● మల్లన్న సన్నిధికి పోటెత్తిన భక్తజనం



దృష్టికుంభం ముందు అధికారులు, పాలకవర్గం సభ్యులు

ఐనవోలు, న్యూస్‌టుడే: వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది. జాతర ప్రారంభం సందర్భంగా దృష్టికుంభం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. 1.5 క్వింటాళ్ల బియ్యాన్ని వండి పసుపు, కుంకుమ కలిపి వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి ఎదురుగా రాశిగా పోశారు. ఈ సందర్భంగా పలువురు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. దృష్టికుంభంతో జాతర ప్రారంభమైనట్లు భావిస్తారు. ఈ నెల 13న ధ్వజారోహణ, 14న రుద్రాభిషేకం, 15న మకర సంక్రాంతి సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, రాత్రివేళ ఆలయం చుట్టూ బండ్ల ప్రదర్శన నిర్వహిస్తారు. 17న మహాసంప్రోక్షణ క్రతువు ఉంటుంది. జాతర ప్రారంభం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు భక్తులు సంప్రదాయ నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, ఆలయ ఈవో సదానందం, డైరక్టర్లు చందర్‌రావు, భూపాల్‌రెడ్డి, సోమేశ్వర్, మల్లయ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

## నేడు కేయూకు సెలవు

**కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే:** కాకతీయ విశ్వవిద్యాలయంకు సోమవారం సెలవు దినమని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త సంవత్సరం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. దీనికి బదులుగా వచ్చే నెల 10వ తేదీ (రెండో శనివారం) పనిదినమని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాలల యాజమాన్యాలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

## ఎంబీఏ పరీక్ష ఫీజు గడువు 2

**కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే:** కాకతీయ విశ్వవిద్యాలయం వారు రెగ్యులర్‌గా అందిస్తున్న ఎంబీఏలో విద్యార్థులు తమ పరీక్షల ఫీజులను ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 2వ తేదీలోగా చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.మహేందర్‌రెడ్డి, అదనపు అధికారి ఆచార్య వి.రామచంద్రంలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ప్రథమ సెమిస్టర్ల విద్యార్థులు ఫీజులు చెల్లించుకోవచ్చునని వివరించారు. రూ.250ల అపరాధ రుసుంతో ఈనెల 8వ తేదీలోగా ఫీజులను చెల్లించాలని తెలిపారు. అన్ని పేపర్లకు రూ.950లు, ఒకటి లేదా రెండింటికి రూ.500లు, ఇంప్రూవ్‌మెంట్ కోసం ప్రతి పేపర్‌కు రూ.300లు చెల్లించాలని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు తమ సంబంధిత కళాశాలల్లో ఫీజులను చెల్లించాలని పేర్కొన్నారు.

## 3 నుంచి కేయూ ఎంసీఏ పరీక్షలు

**కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే:** కాకతీయ విశ్వవిద్యాలయం వారు రెగ్యులర్‌గా అందిస్తున్న ఎంసీఏ ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.మహేందర్‌రెడ్డి, అదనపు అధికారి ఆచార్య వి.రామచంద్రంలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్, గతంలో ఉత్తీర్ణత సాధించనివారు, మార్కుల్లో ప్రగతిని కోరుకునే వారు పరీక్షలు రాయవచ్చునని వివరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈనెల 3, 5, 8, 10, 12 తేదీల్లో పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఫీజులు చెల్లించిన విద్యార్థులు తమ సంబంధిత కళాశాలల నుంచి హాల్‌టికెట్లను పొందవచ్చునని అధికారులు స్పష్టం చేశారు.

## సేవా కార్యక్రమాల్లో అగ్రస్థానంలో ఉండాలి

ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య




జ్యోతి వెలిగిస్తున్న చుక్కా రామయ్య, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాల్లో వరంగల్ లయన్స్‌క్లబ్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలవాలని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య అన్నారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులోని శ్రీనివాస రామానుజన్ పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320ఎఫ్ రాజన్న రీజియన్ 2017-18 సమావేశాన్ని నిర్వహించారు. చుక్కారామయ్య, లయన్ అరుణ తదితరులు జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చుక్కా రామయ్య మాట్లాడుతూ లయన్స్ క్లబ్ రీజియన్ ఛైర్‌పర్సన్ ముచ్చా రాజిరెడ్డి మాట్లాడుతూ వరంగల్ లయన్స్ క్లబ్ 13 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. ఉచిత కంటివైద్య శిబిరాలు, అన్నదానాలు, విద్యాగోష్ఠులు, రీజియన్ సమావేశాలు, విద్య, వైద్యం, వ్యవసాయం, సాంస్కృతిక విభాగాల్లో 13 క్లబ్‌లను ప్రోత్సహిస్తోందన్నారు. ఉత్తమంగా ఎన్నికైన క్లబ్‌లకు రామయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాజీ వీసీ ఆచార్య వి.గోపాల్‌రెడ్డి, పోశాల చందర్, నంగునూరి అశోక్, లింగమూర్తి పాల్గొన్నారు.

# మహబూబాబాద్

## ప్రజలకు చేరువగా సేవలందించాలి

**కేసముద్రం :** పోలీసులు ప్రజలకు చేరువగా ఉండి సేవలందించాలని మహబూబాబాద్ డీఎస్పీ నరేశ్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ ఠాణాను ఆదివారం ఆయన సందర్శించి పరిశీలించారు. రికార్డులను పరిశీలించి, పోలీసుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాన కూడలిలలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసి, నేరాలను నియంత్రించాలని సూచించారు. ఎస్సై శ్రీనివాసరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గ్రామాల్లో రిలే దీక్షలు

**మానుకోట టౌన్ :** హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేపట్టిన దీక్షకు మద్దతుగా ఆరువేల గ్రామాల్లో రిలే దీక్షలు నిర్వహిస్తున్నట్టు సంఘ జిల్లా ఇన్‌ఛార్జి ఏపూరి వెంకటేశ్వర మాదిగ ఆదివారం ఇక్కడ తెలిపారు. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా తెరాస కృషి చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన దీక్ష చేపట్టారన్నారు.

## మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.. 2018

Advt. Spl

## సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి కృషి చేయాలి

**నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే:** జిల్లా కేంద్రంలో కమ్మ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను కోరినట్లు కమ్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కమ్మ సంక్షేమ సంఘం కమిటీని నియమించినట్లు ఆయన తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా తాను నియామకమైనట్లు నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. సంఘం రిజిస్ట్రేషన్ 1082 ద్వారా సంఘం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రావూరి మాధవరావు, లెనిన్‌బాబు, రాజేష్ పాల్గొన్నారు.

## రాయితీ రుణాలు అందజేయాలి

**కేసముద్రం, న్యూస్‌టుడే:** నాయీబ్రాహ్మణులకు ఎటువంటి షరతుల్లేకుండా రాయితీ రుణాలు అందజేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు లింగాల నేతాజీ కోరారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో కేసముద్రం పట్టణ కమిటీని ఎన్నిక చేసి, వివరాలు ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడిగా నాగబెల్లి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి లింగాల రాజు, ఉపాధ్యక్షుడిగా వి.రాజు, సహాయ కార్యదర్శిగా జె.లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఎల్.యాకయ్య, ప్రచార కార్యదర్శిగా ఎం. యాకయ్య మరికొద్ది మందితో నూతన కమిటీని నియమించినట్లు ఆయన వివరించారు. విజయ్, సుధాకర్, విక్రమ్, నర్సయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్

## దైనందిని ఆవిష్కరణ

**మానుకోట టౌన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు బి. రమేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతన దైనందిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస శ్రీనివాస్ పాల్గొని మాట్లడారు. ప్రభుత్వ పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలని అన్నారు. ఎస్.కవిత, ఉప్పలయ్య, సదానందం, ఎ.గోవర్ధన్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో బదిలీలను నిర్వహించాలి

**మానుకోట టౌన్, న్యూస్‌టుడే:** కామన్ సర్వీస్ రూల్స్ రూపొందించి ఈ వేసవి సెలవుల్లోనే ప్రమోషన్లు కల్పించి, బదిలీలను నిర్వహించాలని, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. బాలకుమార్ తెలిపారు. పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించడానికి ఏర్పాటుచేసిన కమిటీ ఏటా 10 శాతం ఫీజుల పెంపుదల సిఫారసును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్. భాస్కర్, జి.మోతి లాల్, బి.సులోచన తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాల పంపిణీ

**నెహ్రూసెంటర్ :** బాలునాయక్ ఛారిటబుల్ ట్రస్టు ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏఎల్ నగర్‌లో ఆనాథ పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, పలకలు పంపిణీ చేసినట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య బాలునాయక్ తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అని భావించి అనాథలకు చేయూతనిచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ట్రస్టు బాధ్యులు ఆర్.నవీన్‌రెడ తదితరులు పాల్గొన్నారు.



Eenadu, MBD; 8008550240

# CLASSIFIEDS

YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, PAINTS, HOMEO, BABY CARE CENTERS, IRON & CEMENT, EYE CARE, COOKING, ... MESS, ... OLOGY, ... DELIVERY, HOME APPLIANCES, THANKS GIVING, LOST & FOUND, GIFTS, COURIERS, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

THE EENADU WAY CLASSIFIEDS

## NEW YEAR GREETINGS

**మా కస్టమర్లకు,** శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. శ్రీ గాయత్రి (ఎంపోరియం) బ్యూటీ పార్లర్, ప్రొ॥ ప్రసన్న. Ph: 9177301246.

**కస్టమర్లకు** & మిత్రులకు Md. తకీల్ పాషా గారి నూతన సంవత్సర శుభాకాంక్షలు. A-1 టూర్స్& ట్రావెల్స్. 9505039393.

**గ్రామ ప్రజలకు** & కస్టమర్లకు Md. తకీల్ పాషా గారి నూతన సంవత్సర శుభాకాంక్షలు. అన్ని రకముల శుభకార్యలకు సరసమైన ధరలకు సప్లై చేయబడును. మదీన చికెన్ & మటన్ సెంటర్. ములుకనూరు. 9505830993.

**వరంగల్ జిల్లా** ప్రజలకు, మా కస్టమర్లకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. V.V.R. Micro Systems. కొత్తవాడ, WGl. Ph: 7799190191.

**మా కస్టమర్లకు,** బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు, నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. శరణ్య మొబైల్స్. టంకు నాగరాజు. Ph: 9963330543.

**మా కస్టమర్లకు,** బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. శర్మ ఎంటర్‌ప్రైజెస్, గోపాలస్వామి గుడి దగ్గర, వరంగల్. Ph: 9848756862.

**బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు,** నగర ప్రజలకు, కస్టమర్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. సిరి లక్ష్మీగణపతి పూజా, ఆయుర్వేద & చౌదాపూడి స్టోర్స్. కాశిబుగ్గ. Ph: 9963222498.

**మా కస్టమర్లకు,** చిట్స్ సభ్యులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. శ్రీ యాదాద్రి చిట్‌ఫండ్ ప్రై॥లీ॥ WGL, 9133310069.

**కాంగ్రెస్ పార్టీ** 6వ- డివిజన్ ప్రెసిడెంట్ చింత ప్రకాశ్ (Ex-MPTC) మరియు తిమ్మపురం గ్రామ ప్రజలకు జన్ను లక్ష్మణ్ గారి నూతన సంవత్సర శుభాకాంక్షలు.

## BUSINESS SERVICES

### WANTED DEALERS/AGENTS

**Wanted Distributors:** ప్రముఖ కూల్‌డ్రింక్స్ పంపిణీ చేయుటకు పట్టణముల వారీగా/ ఏరియాల వారీగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. ✆ 8125787353/ 9849777717.

### BUSINESS OFFER

**హోల్‌సేల్ వస్త్రవ్యాపారులకు** మావద్ద ఆల్ శారీస్, డ్రస్‌మెటీరియల్స్, షూటింగ్ షర్టింగ్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కాస్ట్‌కు లభించును. Hyd: 7095930991/ 9121017798/ E/G ద్వారపూడి: 7337530469

## BUILDING & CONSTRUCTION

### SEPTIC TANK CLEANING

**సెప్టిక్ ట్యాంక్** క్లీనర్: నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును, డి.ఎస్.రావు, Cont: 9849145043, 9866584455.

## COMPUTER EDUCATION

**ఉచిత కంప్యూటర్,** టైలరింగ్ శిక్షణ PGDCA, టైలరింగ్ & కటింగ్ నేర్పబడును. UCIT Computer Education. Kishanpura, HNK. 9966343485, Wesley Public School, Kazipet: 9849944406.

## EDUCATION

### JOB TRAINING

**నగర మహిళలకు** శుభవార్త. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనర్లలో నాణ్యమైన శిక్షణ ఇవ్వబడును. ఆసక్తి గల మహిళలు సంప్ర॥ Opp: డిఐజి బంగ్లా, Ph: 8686228461, 08702977464.

## FOOD

**పూతరేకులు, పూతరేకు** చుట్టలు, సున్నుండలు, బెల్లపు అచ్చులు మొదలగు స్వీటు ఐటెమ్స్ హోల్‌సేల్ & రిటైల్‌గా సప్లయి చేయబడును. ✆ 73825 43723, 94418 51521.

## PROFESSIONAL SERVICES

### ASTROLOGY

**బ్రహ్మతంత్ర జ్యోతిష్యకేంద్రం:** విశాఖ సమాచార దినపత్రిక ఆధ్యాత్మిక జ్యోతిష్య విషయ సంగ్రహకర్త శ్రీ సి.వి. చక్రపాణి గారు బ్రహ్మతంత్రం అను ప్రాచీన తాళపత్ర గ్రంధము ద్వారా మీ యొక్క పూర్వజన్మ జాతక చక్ర పరిశీలనచేసి పరిహారాలు వ్రాసి పంపబడును. V.P.P. పోస్టల్ సౌకర్యం కలదు. ✆ 77299 60094, 77300 52204.

## PEOPLE CARE

### OLD AGE HOME

**మీ ఇంటివద్ద** వృద్దులను చూసుకొనుటకు ఇంటిపని, వంటపని చేయుటకు ఆడవాళ్ళని మగవాళ్ళని 24 గం॥లు సర్వీస్సు ఇవ్వగలము. హైదరాబాద్. ✆ 97043 71576, 72860 26405.

## REAL ESTATE

### HOUSE FOR SALE

**ఇన్ఫోసిస్, రాంపల్లి,** ఘట్‌కేసర్‌లలో అపార్ట్‌మెంట్ ధరకే ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మబడును. పరిమిత ఇళ్లు మాత్రమే కలవు. ✆ 9966330993, 9390330993.

### PLOT FOR SALE

**Highway Facing** Commercial/ Residential Plots & Villas at Bhongiri. Near Collectorate Office. HMDA App'vd Township with Legendary Entrance, CC Roads & Underground Cabling Bank Loans ✆ 9030121310

**హైదరాబాద్ హయత్‌నగర్** (మండలం) పెద్దఅంబర్‌పేట, కోహెడ, పసుమాముల జనచైతన్య, తొర్రూర్, మునగనూరులలో ప్లాట్లు అమ్మాలన్నా/ కొనాలన్నా ✆ 9848775981, 9391775981.

**యాదాద్రికి అతిసమీపంలో** DTCP Approved లేఅవుట్ నందు అన్ని సౌకర్యాలతో Proposed రిటైర్‌మెంట్ హోమ్స్, రిటైర్‌మెంట్ ఉద్యోగులకు సువర్ణావకాశం Ph: 6281256685/ 8464850159

**వరంగల్‌హైవే ఫేసింగ్** LP.No: 96/2016 గేటెడ్ లే-అవుట్‌లో బ్యాంక్‌లోన్ సదుపాయంతో ఇండ్ల స్థలాలు సంప్ర॥ 7702113618.

**సమత వెంచర్** భీమారం తాళ్ళల్లో 150 గజాలు, 150 గజాల వేర్వేరు ప్లాట్లు పక్కా రిజిస్ట్రేషన్ కల్గినవి అమ్మబడును. సంప్ర: 9399913107, 9550222127.

## TO-LET

**HNK బస్టాండ్** పద్మాక్షి గుడి రోడ్డులో బాలాంజనేయ స్వామి గుడి వద్ద (ఆంధ్రాబ్యాంకు ప్రక్కన) షట్టర్స్ కిరాయికి ఇవ్వబడును. 9966524911, 9849313697.

**2BHK: ఫుల్లీ** ఫర్నిష్డ్ Flat కార్ పార్కింగ్, లిఫ్ట్, వరంగల్ పబ్లిక్ స్కూల్ ప్రక్కన అదాలత్ మెయిన్ రోడ్డు హన్మకొండ. ✆ 7097784955/ 9885156761

## SITUATIONS VACANT

**Professional Cook** or Cheff needed for Household at Ramnagar, warangal. 7893171006.

**Hydలో ప్రముఖ** ఓల్డేజ్‌హోమ్ నందు పనిచేయుటకు 40 సం॥లోపు స్త్రీ/ పు కావలెను. జీ॥ 8-10 వేలు + భోజనం + వసతి @ మల్కాజ్‌గిరి. ✆ 9347998198.

**జూనియర్ కళాశాలలో** PRO లుగా పనిచేయుటకు అనుభవం, అంకితభావం కలిగిన వ్యక్తులు కావలెను. ఫుల్‌టైం వేతనం సంప్ర: 9177957161, 9849378581.

**ITI Freshers** ఫిట్టర్స్ & ఎలక్ట్రీషియన్స్ అర్జంటుగా కావలెను. జీతం: 10,000 - 15,000/- Contact : 9949987087/ 8466999982

**B.Sc., GNM,** ANM and Ward Boys కావలెను. సంప్ర: Lifeline Hospital, Cell No: 99630 50736, 96762 27466.

**Solar Faculty:** Qua: B-Tech/ M-Tech. Male/ Female. Soft Skill's: Qua: M.A. (Eng) and Medical Faculty (Male/Female). Contact: 9177998599, 9440691816.

**అక్షర చిట్‌ఫండ్స్** Pvt.Ltd. కాజీపేట్-2 బ్రాంచ్ (ఫాతిమానగర్) నందు అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్స్ & ఏజెంట్స్ కావలెను. చిట్‌ఫండ్స్ రంగంలో అనుభవం గల వారికి ప్రాధాన్యత. బ్రాంచ్ మేనేజర్: 7993340073.

**24 Hrs** ఇంట్లోనే ఉండి వంట చేయుటకు ఇల్లు చూసుకోవడానికి బాదర బంది లేని ఆడమనిషి కావలెను. Ph:9490300460.

**వార్డుబాయ్స్** కావలెను. హన్మకొండ చౌరస్తాలోని హాస్పిటల్‌లో సంప్రదించండి. 9949945344, 0870-6575833

## MARKETING / SALES

**J.S.R. గ్రూప్** సన్‌సిటీ యాదగిరిగుట్ట వరంగల్ హైవేలో రియల్‌ఎస్టేట్ మార్కెటింగ్‌కు టీమ్‌లీడర్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం + కమీషన్ + ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. Ph: 7799893899.

## FACULTY / TEACHERS

**అనూస్ IIT/** MEDICINE అకాడమీ హైస్కూల్, జూనియర్ కళాశాలలో పనిచేయుటకు అనుభవం కలిగిన Foundation Teachers, Lecturers (MPC-BiPC) కావలెను. Sal: 25K-1 Lakh. 30 ఎకరాల హాస్టల్ క్యాంపస్‌లో భోజన వసతి. Resume: careersatannus@gmail.com Ph: 8985555585.

## TOURS & TRAVELS

**గోవా, కర్ణాటక** 20 క్షేత్రాల యాత్ర జనవరి 19న జనవరి 29న శిరిడి+ 5 జ్యోతిర్లింగాలతో 21 క్షేత్రాలు, శివరాత్రికి రామేశ్వరం+ 30 క్షే॥ ఫిబ్రవరి 7న. ✆ 98662 46466.

**హాలీడేస్ నేవిగేటర్:** శ్రీలంకయాత్ర 14/2, 19/2, చెన్నై @ 29,999/-, హైదరాబాద్ @ 36,999, అన్ని వసతులతో ఉ & ద భారత, అంతర్జాతీయ యాత్రలకు. ✆ 9533444455/ 9533223366

## ASTROLOGY

**Nadiastrology Guruji** A.Sivaguruswamy Head Off: Vaitheeswarankoil (TN) Hyd. No Other Branches in T.S. Happy New Year. 9963334337 / 040-27031312 www.sivanadi.com

### గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.






# ఈటీవీ తెలంగాణ ముత్యాల ముగ్గుల పోటీ

ఈటీవీ తెలంగాణ, ఈనాడు ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నారు. జనవరి 1 నుంచి 15 వరకు పదిహేను రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయి. మీరు చేయాల్సిందల్లా ప్రతిరోజూ మీ ఇంటి ముంగిట చక్కని ముగ్గు వేసి ఆ ముగ్గు కిందనే మీపేరు, మీ ఊరు, మొబైల్ నెంబర్ రాసి ఫొటో తీసి 80080 29058 నెంబర్‌కు వాట్సాప్ చేయండి. అలా వాట్సాప్ ద్వారా మేము అందుకున్న ముగ్గుల్లో నుంచి ప్రతిరోజు పది అత్యుత్తమమైన వాటిని విజేతలుగా ఎంపిక చేస్తాం. విజేతల పేర్లు ఈటీవీ తెలంగాణ, ఈనాడులో ప్రకటిస్తాం. బహుమతులు వారి ఇంటికే పంపిస్తాం.

# జిల్లా సమగ్రాభివృద్ధికి ఉద్యమించాలి

## ❑ ముగిసిన సీపీఎం జిల్లా మహాసభలు

## ❑ పలు తీర్మానాలు ఆమోదం

**శివనగర్, న్యూస్‌టుడే:** వరంగల్ అర్బన్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రజల పక్షాన నిలిచి ఉద్యమించాలని సీపీఎం మహాసభలో తీర్మానించారు. రెండు రోజులుగా హన్మకొండలోని కల్యాణి ఫంక్షన్ హాల్ కొప్పుల ఎల్లయ్యనగర్‌లో నిర్వహిస్తున్న సీపీఎం అర్బన్ జిల్లా మహాసభలు ఆదివారంతో ముగిశాయి. అర్బన్ జిల్లా కార్యదర్శి సారంపెల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగిన రెండో రోజు మహాసభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.వెంకట్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో వనరులు, సమస్యలు, వాటి పరిష్కారానికి గల అవకాశాలు, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. జిల్లాలో సీపీఎం బలం, బలహీనతలను విశ్లేషించడంతో పాటు భవిష్యత్తులో బలపడడానికి ప్రజల పక్షాన నిలవాలని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని, వ్యూహాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. 2016 మార్చిలో జరిగిన ఎన్నికల్లో వరంగల్ సమగ్రాభివృద్ధికి తెరాస ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జిల్లాలో కాంగ్రెస్ పోయి తెరాస అధికారంలోకి వచ్చినా నగరాభివృద్ధిలో మార్పులేదని తీర్మానంలో పేర్కొన్నారు. పారిశ్రామికాభివృద్ధిలో జిల్లా అత్యంత వెనుకబడిందని, వనరులుండి పరిశ్రమలను ఏర్పాటుచేయడంలో ప్రభుత్వం విఫలమైందని మహాసభ అభిప్రాయపడింది. వైద్యం పరంగా ఎంజీఎం ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా ప్రకటించినా నేటికి అన్ని విభాగాలలో నిపుణులైన వైద్యులను నియమించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కనీస వసతులు లేక వైద్యం అందని ద్రాక్షలా మారిందన్నారు. వెంటనే ప్రజలకు విద్య, వైద్యం అందించడానికి ప్రభుత్వం స్పందించాలని మహాసభలో నేతలు విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.వెంకట్

### తీర్మానాలివే..

**☛ మహిళలపై హింసను అరికట్టాలి**

జిల్లాలో మహిళలపై అనేక రూపాల్లో పెరుగుతున్న హింసను అరికట్టాలని తీర్మానించారు. దేశంలో ఢిల్లీ తర్వాత రెండో స్థానంలో తెలంగాణ ఉందన్నారు. పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం, అసహాయత, అభద్రత ముఖ్యంగా బతుకుదెరువు లేకపోవడం మహిళలపై హింసను పెంచాయని నేతలు అభిప్రాయపడ్డారు. దాడుల నివారణకు ప్రభుత్వం వెంటనే మహిళల సమస్యలపై దృష్టిని కేంద్రీకరించి అభయహస్తం పింఛన్లు ఇవ్వాలన్నారు. మద్యం బెల్టు దుకాణాలను అరికట్టడానికి ఉద్యమించాలని తీర్మానించారు. గృహహింస చట్టం అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలన్నారు. బస్‌స్టాప్‌ల వద్ద పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేయాలని, విద్యా సంస్థలలో ఫిర్యాదుల కమిటీలు, బాక్సులు ఏర్పాటుచేయాలని, మద్యం అమ్మకాలను నియంత్రించాలని, వితంతు మహిళలకు రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వాలన్నారు.

**☛ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి**

తెలంగాణలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌లో యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి పరిశ్రమలు ఏర్పాటుచేయాలని, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని, హైదరాబాద్, వరంగల్ వరకు పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుచేయాలని, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేయాలని, అందరికీ ఉద్యోగాలు కల్పించాలని, నిరుద్యోగులకు భృతి చెల్లించాలని, ప్రభుత్వం ఉచితంగా నాణ్యత, ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని తీర్మానించారు.

**☛ అసంఘటిత కార్మికులను ఆదుకోవాలి**

జిల్లాలో ఉన్న దాదాపు 1.50 లక్షల మంది అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనంగా రూ.18 వేలు అమలుచేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, పని భద్రత కల్పించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని, పింఛన్లు అందించాలని మహాసభల్లో తీర్మానించారు.

# రాష్ట్రాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టొద్దు

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.వెంకట్

**శివనగర్, న్యూస్‌టుడే:** తెరాస ప్రభుత్వం అధికారకాంక్షతో రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టుపెట్టి ప్రజా ప్రయోజనాలను విస్మరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి. వెంకట్ ఆరోపించారు. హన్మకొండలోని కల్యాణి ఫంక్షన్ హాల్ కొప్పుల ఎల్లయ్యనగర్‌లో ఆదివారం రెండో రోజు సీపీఎం అర్బన్ జిల్లా మహాసభలలో భాగంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భాజపా మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని, కరీంనగర్‌లో ఇటీవల విద్యా సంస్థలలో విద్యార్థులు పరస్పరం రాళ్లురువ్వుకోవడాన్ని ఆసరాగా చేసుకొని విద్యార్థులను నిర్బంధించడాన్ని గుర్తుచేశారు. మత సామరస్యం ఉండాలని మతోన్మాదం ఉండరాదన్నారు. ఈ విషయంలో తెరాస ఉదాశీనత ప్రదర్శించడం సరికాదన్నారు. వరంగల్ జిల్లాలోని పరిశ్రమలను కాపాడడానికి బదులుగా అజంజాహి మిల్లు, బిల్టు పరిశ్రమలను మూసివేశారన్నారు. తెరాస ప్రభుత్వంలో ఇప్పటికే 30 పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. సీపీఎం అధికారంలో ఉన్న కేరళలో మూతపడిన 4 పరిశ్రమలను పునరుద్ధరించారని చెప్పారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కొత్త పరిశ్రమలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో ఎన్నికల కోసం జీఎస్టీలో కొన్ని స్లాబ్‌లు తెచ్చారని, రాష్ట్రం ప్రభుత్వం జీఎస్టీ విషయంలో ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయం, బీడీ, వస్త్ర పరిశ్రమలపై అధికంగా జీఎస్టీని విధించారని, ఫలితంగా తెలంగాణలో తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. రైతులకు ఉపయోగపడేలా కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేయాలనే ఆలోచనలు చేయడం లేదన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో కులాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ప్రతినిధి అనే విషయాన్ని మర్చిపోతున్నారన్నారు. పండగల పేరిట మతాన్ని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఆలయాల్లోని అర్చలకు వేతనాలు ఇచ్చినట్లుగా చర్చిల్లోని పాస్టర్లకు వేతనాలు ఇవ్వాలన్నారు. దళిత క్రైస్థవులకు ఎస్సీలుగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంద కృష్ణను అరెస్టు చేయడం దళితులపై ప్రభుత్వం దాడిచేసినట్లుగా భావిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం వెంటనే అఖిల పక్షాన్ని కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ తన వైఖరిని వెంటనే వెల్లడించాలన్నారు. ఆదివాసులు, లంబాడీలకు మధ్య చిచ్చు పెట్టింది తెరాసనే అన్నారు. కొత్త సంవత్సరంలోనైనా ఏ నెలలో ఏయే ఉద్యోగాలను భర్తీ చేస్తారో తెలిపేలా ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేయాలన్నారు. మేడారం జాతరను స్వతంత్రంగా నిర్వహించేలా రాజకీయ జోక్యం లేని కమిటీ ద్వారా జరిపించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, నలిగంటి రత్నమాల, జి. వెంకట్ మాట్లాడారు.

# 159 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం..!

**☛ లారీ, ఆటో సీజ్.. ముగ్గురు నిందితుల అరెస్ట్**
**☛ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి**

**మరిపెడ, న్యూస్‌టుడే:** ఆహార భద్రతా పథకం కింద ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. మరిపెడ శివారు చోక్లా తండా సమీపంలో ఒక వ్యాపారి రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన లారీలో అక్రమంగా బియ్యం లోడ్ చేస్తుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి మరిపెడ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. చోక్లా తండాకు చెందిన బానోత్ కిషన్ రేషన్ వినియోగదారుల నుంచి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో మరిపెడ ఎస్సైలు వెంకటేశ్వర్లు, ప్రసాదరావు సిబ్బందితో దాడులు నిర్వహించగా వ్యాపారి బానోత్ కిషన్ అతని అనుచరుడు శివ సహాయంతో ఆటోలో జన సంచారం లేని గుట్టవద్దకు బియ్యం తరలించి లారీలో లోడ్ చేస్తుండగా పట్టుబడ్డారు. 159 కింటాళ్ల బియ్యం, లారీ, ఆటోలతో సహా సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులు కిషన్, శివలతో పాటు లారీ డ్రైవర్ బన్వారి గోదారాలను అరెస్టు చేశారు. గత కొంత కాలంగా జిల్లాలో పోలీసు శాఖ చేపట్టిన చర్యలతో అక్రమ వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయని, మరిపెడలో గుట్టుచప్పుడు కాకుండా గుట్ట వద్ద స్థావరం ఏర్పాటు చేసుకొని అక్రమ వ్యాపారం చేస్తుండగా గుర్తించామన్నారు. అక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిందితులను చాక చక్యంగా పట్టుకున్న ఎస్సైలు వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, హెడ్ కానిస్టేబుల్ బిచ్చానాయక్, హోంగార్డ్ మదార్‌లకు నగదు బహుమతి అందజేశారు. సమావేశంలో డీఎస్పీ రాజారత్నం, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.


పట్టుబడ్డ రేషన్ బియ్యంతో పోలీసులు



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ కోటిరెడ్డి

# జూన్ నాటికి అంతర్గత పైపులైన్ల నిర్మాణం పూర్తి

**అబ్బాయిపాలెం(మరిపెడ), న్యూస్‌టుడే:** దాహార్తితో అలమటించే గ్రామాల్లోని ప్రజలకు నీరందించాలనే లక్ష్యంతో ఇంటి ఇంటికీ నల్లాల ద్వారా సురక్షిత తాగునీరందించేందుకు సీఎం కేసీఆర్ చేసిన ప్రతిజ్ఞ నెరవేరబోతోందని శాసనసభ్యుడు రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం అబ్బాయిపాలెం శివారు ఎదళ్లగుట్ట వద్ద కొనసాగుతున్న నీటిశుద్ధి కేంద్రం పనులను ఆయన పర్యవేక్షించారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా తాగునీరందించేందుకు చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. 90 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయని జూన్ నాటికి అంతర్గత పైప్‌లైన్ల నిర్మాణం పూర్తిచేయడం జరుగుతుందన్నారు. పాలేరు జలాశయం వద్ద ఇంటెక్‌వెల్ నిర్మించి సుమారు 25 కిలోమీటర్ల దూరం పైపులైన్ ద్వారా ఎదుళ్లగుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న నీటిశుద్ధి కేంద్రంలో నీరు శుద్ధి చేసేందుకు చేపట్టిన భారీ కట్టడాల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయన్నారు. నీటి శుద్ధి కేంద్రాల నుంచి గ్రామాల దాకా పైపులైన్ నిర్మాణం పూర్తయిందన్నారు. రెండో దశలో అంతర్గత పైపులైన్ నిర్మాణాలు, ఓహెచ్ఎస్సార్ ట్యాంకుల నిర్మాణం పూర్తవుతుందన్నారు. ఆయన వెంట ఆర్డీఓ కృష్ణవేణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సురేందర్, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తెరాస నాయకులు పాల్గొన్నారు.


మిషన్ భగీరథ పనులను పరిశీలిస్తున్న రెడ్యానాయక్

## సంఘటిత ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

**మహబూబాబాద్, న్యూస్‌టుడే:** సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడేందుకు సంఘాన్ని బలోపేతం చేయాలని విశ్వకర్మ ఎంప్లాయీస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ అసోసియేషన్ (వేదాస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూము నాగాచారి కోరారు. ఆదివారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వకర్మ ఉద్యోగులు క్షేత్రస్థాయి నుంచి విశ్వబ్రాహ్మణ సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వేదాస్ ఆధ్వర్యంలో రూపొందించిన 2018 కాలమానిని ఆవిష్కరించారు.

## సలీమా ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి


పాదయాత్రలో పాల్గొన్న తెరాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు

**మహబూబాబాద్, న్యూస్‌టుడే:** పర్యావరణ పరిరక్షణ, మూఢ నమ్మకాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నేను సైతం స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి సలీమా ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరం అండగా ఉందామని తెరాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో 39 రోజుల్లో 21 గ్రామాల్లో 183 కిలో మీటర్లు పాదయాత్ర చేసి మహబూబాబాద్ మండలంలో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మహబూబాబాద్‌లో కూడా పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ పర్యావరణం కోసం ఓ మహిళా అలు పెరగకుండా పాదయాత్ర చేయడం ఎంతో అభినందనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలు నిబద్ధతతో పని చేయాలని ఇందుకు సలీమాను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న తక్కెళ్ళ పల్లి రవీందర్‌రావు


సంక్షేమ గురుకుల పాఠశాలలో నూతన సంవత్సర సంబురాలు జరుపుకుంటున్న విద్యార్థినులు

**నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే:** మహబూబాబాద్‌లో ఆదివారం రాత్రి 2018 నూతన సంవత్సరానికి యువత కేరింతలతో ఘనంగా స్వాగతం పలికారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో , గౌతమి జూనియర్ కళాశాలలో కేకులు కోశారు. యువత మద్యం మత్తులో ప్రమాదాల బారిన పడకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి పర్యవేక్షణలో రాత్రి తనిఖీలు చేపట్టారు.

## సుఖసంతోషాలతో ఉత్సవాలు జరుపుకోవాలి

**మరిపెడ, న్యూస్‌టుడే:** జిల్లా వాసులకు ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మరిపెడలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గడిచిన ఏడాది శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మందులబజార్‌లో చోరీ

**నెహ్రూసెంటర్(మానుకోట), న్యూస్‌టుడే:** పట్టణంలోని మందుల బజార్‌లో చోరీ జరిగిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన వల్లెపు సురేశ్ గత కొంత కాలంగా కరీంనగర్‌లోని కూలి పనులకు వెళ్లి జీవనం కొనసాగిస్తున్నారు. కరీంనగర్ నుంచి ఆదివారం సాయంత్రం ఇంటికి ఇంటి తాళం పగలకొట్టి కనిపించింది. గుర్తు తెలియని దుండగులు తలుపులు పగులగొట్టి ఇంట్లో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, రెండుతులాల నక్లెస్, ,తులంన్నర నల్లపూసల గొలుసుతో పాటు లక్ష యాభై వేల నగదును అపహరించినట్లు బాధితుడు తెలిపాడు.

## ఉద్యోగాల సాధనకు ఉద్యమాలతో ముందుకు సాగాలి

**మహబూబాబాద్, న్యూస్‌టుడే:** తెలంగాణాలో ఉద్యోగ సాధన కోసం ప్రభుత్వంపై పోరాడేందుకు ఉద్యమాలతో ముందుకు సాగాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రావుల రాజు కోరారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన ఐక్య విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వస్తే లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నా కేసీఆర్ వెయ్యి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో విద్యార్థి, యువజనుల ఆత్మహత్యలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యోగ సాధన కమిటీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నారన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక


నవీన్‌కుమార్ మాదిగ

**గూడూరు, న్యూస్‌టుడే:** టీఎమ్మార్పీఎస్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా గూడూరుకు చెందిన బాషికాల నవీన్‌కుమార్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా జలగం మహేశ్, బోడ సాంబయ్య, ఎర్రబెల్లి యాకాంబ్రం, ఇలపొంగు కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మందుల సమ్మయ్య, కార్యదర్శిగా మాదాసి రాజు, సహాయ కార్యదర్శిగా కుక్కలముడి యాకయ్య, కోశాధికారి కందిక శంకర్, అధికార ప్రతినిధి గద్దల యాకయ్య, కమిటీ సభ్యులుగా యాసారపు సారయ్యను ఎన్నుకున్నారు.

## వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం

**మహబూబాబాద్, న్యూస్‌టుడే:** వాసవీక్లబ్ మహబూబాబాద్‌శాఖ నూతన కార్యవర్గాన్ని క్లబ్ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు వి.కిశోర్‌కుమార్ తెలిపారు. 2018 సంవత్సరానికిగాను నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బి.రాజేశ్వరరావు, సీహెచ్. ఓంప్రకాశ్, కోశాధికారిగా ఇ.చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న సరోత్తంరెడ్డి

**నర్సింహులపేట, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కాఆరినిక పీఆర్టీయూ కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి సరోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం నర్సింహులపేటలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో పీఆర్టీయూ 2018 నూతన సంవత్సర కాలమానిని ఆ సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పీఆర్టీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోనే పెద్ద సంఘంగా ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌రెడ్డి, బద్రినారాయణ, వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఎడ్ల ఉపేందర్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

## జాతీయ కుటుంబాలుగా గుర్తించాలి

**మహబూబాబాద్, న్యూస్‌టుడే:** స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలను జాతీయ కుటుంబాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల సంఘం జిల్లా అధ్యక్షుడు వి.వెంకట్రామ నర్సయ్య కోరారు. ఆదివారం మహబూబాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన సమరయోధులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. తెలంగాణ ఆర్టీసీలో ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలని కోరారు.

# బాలల సృజనాత్మకతకు వేదిక



# 'చిన్నారి లోకం'

## అబ్బురపరిచే చిన్నారుల ప్రతిభకు ఆకాశవాణి పట్టం

న్యూస్‌టుడే, హసన్‌పర్తి

'చిట్టి చిలకమ్మ అమ్మ కొట్టిందా', 'అనగనగా ఒక రాజూ'.. అంటూ చిన్నారులు ముద్దులొలికేలా పాడే పాటలు, చెప్పే చిన్న చిన్న కథలు ప్రతి ఒక్కరిని తన్మయుల్ని చేస్తాయి. పిల్లలు తమ మనసుకు నచ్చే పాటలు, కథలు, ఎంత పెద్దవైనా గుర్తుపెట్టుకుంటారు. తిరిగి మనకు చెబుతూ తమలోని ప్రతిభను ప్రదర్శిస్తుంటారు. ఇలాగే చిన్నారులు తమ ప్రతిభను చాటుకోవడానికి పాతికేళ్లుగా ఆకాశవాణి వరంగల్ కేంద్రం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేస్తోంది. బాలల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీయడానికి 'చిన్నారి లోకం' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. పిల్లల్లోని సృజనాత్మకతను వెలికితీసి బాహ్య ప్రపంచానికి పరిచయం చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు మంచి అవకాశాన్ని కల్పిస్తుంది.



చిన్నారిలోకం రికార్డింగ్‌లో బాలబాలికలు





ఆకాశవాణి కేంద్రం

### ప్రతిభకు చక్కని వేదిక

చిన్నారిలోకం కార్యక్రమం బాలలనే కాదు.. పెద్దలను సైతం అలరిస్తోంది. ఆకాశవాణి వరంగల్ కేంద్రం కొన్ని దశాబ్దాలుగా ప్రసారం చేస్తున్న ఈ కార్యక్రమంలో వినూత్నమైన అంశాలను చిన్నారులు చెబుతుండడంతో.. అన్ని వర్గాలు ఆసక్తి చూపుతున్నాయి. పాఠశాల కింది స్థాయి నుంచి మొదలుకుని పదో తరగతి వరకు చదివే బాలబాలికలు ఈ కార్యక్రమంలో ప్రదర్శన చేస్తూ తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. చిన్నారుల కోసం చిన్నారుల నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం ఇది. ఇందులో పద్యాలు, వాటి తాత్పర్యాలు, చిన్న చిన్న నీతి కథలు, బుర్ర కథలు, నాటికలు, దేశభక్తి, జాతీయ సమైక్యతకి సంబంధించిన గేయాలు, స్వాతంత్ర్య ఉద్యమ నాయకుల అంశాలను చిన్నారులే చెబుతుంటారు. సైన్సు, గణితం, సాంఘిక శాస్త్రాల అంశాలతో పాటు ఆంగ్ల వ్యాసాలు కూడా విన్పిస్తారు. బాలల దినోత్సవం, బతుకమ్మ, క్రిస్మస్ తదితర పండగల సమయంలోనూ ప్రత్యేక కార్యక్రమాలు ప్రసారం అవుతాయి. ఈ కార్యక్రమం ప్రతి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల వరకు 30 నిమిషాలు ప్రసారమవుతుంది.

### అవకాశం ఉంది.. అందుకోవాలి

రేడియో మాధ్యమానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఉపాధ్యాయులే విద్యార్థులను దేశభక్తి, కథలు, నాటికలు, పొడుపు కథలు, తెలుగు, ఆంగ్ల పద్యాలు, వివిధ అంశాలను ప్రదర్శించేలా తీర్చిదిద్దుతున్నారు. అంతర్లీనంగా వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. చిన్నారులు చెప్పే కథలు, నాటికలు, పాటలు, వివిధ అంశాలను ముందుగా రికార్డింగ్ చేసి, ఆ తర్వాత ప్రసారం చేస్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన బాలబాలికలను ప్రోత్సహించడానికి ఆకాశవాణి ఆర్థిక సాయాన్ని సైతం అందిస్తోంది. ఈ ఆర్థిక ప్రోత్సాహం పాఠశాలల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాలకు దోహదపడుతుంటాయి. విద్యార్థులు వ్యక్తిగతంగానూ తమ ప్రతిభను చాటుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ అవకాశాన్ని పదో తరగతి వరకు బాలబాలికలు అందుకోవచ్చు. ఇటీవల స్వచ్ఛ భారత్‌పై పోటీలను నిర్వహించగా కాజీపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న అనూరాధ అనే విద్యార్థిని ద్వితీయ బహుమతి సాధించింది. పెద్దవాళ్లతో పోటీ పడి ఈ విద్యార్థిని ద్వితీయ బహుమతిని దక్కించుకోవడం విశేషం.

ఆకాశవాణి అందించే అవకాశాలను చిన్నారులు అందుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

### ప్రతిభను నిరూపించుకోవడానికి చక్కని అవకాశం: నిహారా కానేటి, కార్యక్రమ నిర్వహణాధికారిణి, ఆకాశవాణి వరంగల్ కేంద్రం



పిల్లలోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఆకాశవాణి వరంగల్ కేంద్రం 'చిన్నారి లోకం' అనే పిల్లల కార్యక్రమాన్ని ఏళ్లుగా ప్రసారం చేస్తోంది. చిన్నారులతో చిన్నారుల కోసమే నిర్వహిస్తున్న కార్యక్రమమిది. తెలుగు పద్యాలు, వాటి తాత్పర్యాలు, నీతిని ప్రబోధించే కథలు, దేశభక్తి గేయాలు, ఆయా పాఠ్యాంశాల్లో ఎన్నో ఆసక్తికరమైన అంశాలు.. ఈ కార్యక్రమంలో ఉంటాయి. పిల్లలు తమ సృజనాత్మకతను చాటుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే, మంచి గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉంది. త్వరలో చిన్నారి లోకంలో విభిన్న కార్యక్రమాలను ప్రసారం చేయడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రాచుర్యం పొందిన పిల్లల పాటల సేకరణ యత్నాలు ప్రారంభమయ్యాయి. పిల్లలను అన్ని విధాలా అలరించే మరెన్నో కార్యక్రమాలను ఆకాశవాణి వరంగల్ కేంద్రం ప్రసారం చేస్తుంది.




# కొత్త కానుకలు

## వివిధ రంగాల అభివృద్ధికి తోడ్పాటు

ఎన్నో తీపి, చేదు జ్ఞాపకాలు మిగిల్చి 2017 కాలగమనంలో కలిసిపోయింది. ఇప్పుడు 2018 సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. ఈ 365 రోజులు మరిన్ని మధురానుభూతుల్ని పంచాలని కోరుకుందాం. విద్య, వైద్య, వ్యవసాయ రంగంతో పాటు ఇతర రంగాలు మరింత పటిష్ఠంగా ఉండాలని ఆశిద్దాం. ఇందుకోసం సర్కారు కూడా మరింత తోడ్పాటును అందించే ప్రయత్నం చేస్తోంది. వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామికంగా అభివృద్ధి బాటలో పయనించేందుకు వివిధ పథకాలు రచించింది. నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సర్కారు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టబోతున్న కొత్త కానుకలపై 'ఈనాడు' కథనం.

ఈనాడు డిజిటల్, మహబూబాబాద్

| జిల్లాల వారీగా వ్యవసాయ కనెక్షన్ల వివరాలు | |
|---|---|
| మహబూబాబాద్ | 73,394 |
| జయశంకర్ భూపాలపల్లి | 48,042 |
| వరంగల్ రూరల్ | 67,698 |
| వరంగల్ అర్బన్ | 41,144 |
| జనగామ | 80,002 |

### వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు



ప్రభుత్వం జనవరి 1 నుంచి వ్యవసాయానికి 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయనుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. సరఫరాలో విజయం సాధించడానికి గతేడాది వారం రోజుల పాటు సరఫరా చేసి లోటు పాట్లను సరిచేసుకున్నారు. అది విజయం కావడంతో జనవరి నుంచి నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయాలని నిర్ణయించుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 3,10,280 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. పంటలు సాగునీటి ఎద్దడికి గురికాకుండా మంచి దిగుబడులు సాధించటానికి, రైతులు ఆర్థికాభివృద్ధికి ఈ కానుక దోహదపడనుందనటంలో సందేహం లేదు.

### ఎకరానికి రూ. 8 వేలు



రైతులకు పంట పెట్టుబడుల కోసం రెండు పంటలకు కలిపి ఎకరాకు రూ. 8వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్నదాతలకు ఎంతో మేలు కలగనుంది. ఇందుకోసం రైతుల వివరాల్ని అధికారులు సేకరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 4,38,029 మంది రైతులున్నారు. ఈ పథకం వల్ల రైతులపై అప్పుల భారం తగ్గనుంది.

| జిల్లాల వారీగా రైతుల వివరాలు ఇలా.. | |
|---|---|
| మహబూబాబాద్ | 1,22,597 |
| జయశంకర్ భూపాలపల్లి | 87,346 |
| వరంగల్ రూరల్ | 98,880 |
| వరంగల్ అర్బన్ | 43,818 |
| జనగామ | 85,388 |

### విద్యారంగానికి మెరుగులు



జిల్లాలోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల విద్యార్థుల ఆహార పట్టిక మారింది. జనవరి నుంచి విద్యార్థులకు కోడి, పొట్టేలు మాంసం వడ్డించనున్నారు. అల్పాహారంలోనూ మార్పులు చేశారు. గతంలో కిచిడి, పులిహోర ఇచ్చేవారు. ఇప్పుడు ఇడ్లీ కూడా అందించనున్నారు. కస్తూర్బా విద్యార్థులకు సౌందర్య సాధనాల సంచులను అందించనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వైఫై ద్వారా అంతర్జాల సౌకర్యం కల్పిస్తున్నారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి కస్తూర్బాల్లో ఇంటర్మీడియట్ విద్య ప్రవేశపెట్టాలని సర్కారు నిర్ణయించుకుంది. ఇది అమలైతే విద్యార్థులకు ఎంతో మేలు కలగనుంది.

జిల్లాల్లో కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల వివరాలు

(● కస్తూర్బా ● ఆదర్శ)

| జిల్లా | కస్తూర్బా | ఆదర్శ |
|---|---|---|
| మహబూబాబాద్ | 16 | 08 |
| వరంగల్ రూరల్ | 12 | 06 |
| వరంగల్ అర్బన్ | 07 | 03 |
| జయశకంర్ భూపాలపల్లి | 20 | 08 |
| జనగామ | 13 | 09 |

### వైద్యానికి భరోసా



ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచడం కోసం గత ఏడాది కేసీఆర్ కిట్టును అమలు చేసిన ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన జిల్లాల్లో ఈ ఏడాది మాతాశిశు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. డయాలసిస్, రక్తనిధి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. మహబూబాబాద్, ములుగు ఏరియా ఆస్పత్రుల్లో ఈ సేవలు ఈ ఏడాది అందుబాటులోకి రానున్నాయి. రోగుల ఇబ్బందులు తొలగనున్నాయి.

### నూతన పరిశ్రమల స్థాపనకు అవకాశం



నూతన పరిశ్రమల్ని ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందుతూ మరికొంత మందికి ఉపాధి కల్పించాలనుకునే వారికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. పరిశ్రమల స్థాపన కోసం పెట్టుబడికి ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా రుణాల్ని అందించడానికి సిద్ధంగా ఉంది. టీఎస్ ఐపాస్ ద్వారా రూ. 40 లక్షల వరకు రుణం ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ అవకాశాన్ని సొంత పరిశ్రమను ఏర్పాటు చేయాలనుకునే వారు సద్వినియోగం చేసుకోవాలి.

## ఎర్రకోటపై

# ఎల్బీ పతాకం

- దిల్లీ కవాతులో విద్యార్థుల ప్రతిభ
- ఏటా పరేడ్‌కు హాజరవుతున్న ఎన్‌సీసీ కెడెట్లు
- 2018 రిపబ్లిక్ డే పరేడ్‌కు స్వప్న ఎంపిక






స్వప్న

న్యూస్‌టుడే, రంగంపేట

నేషనల్ కెడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)కి ఎంపికైన కెడెట్లంతా ఒక్కసారైనా దిల్లీలోని ఎర్రకోట మైదానంలో కవాతు చేయాలని ఉవ్విళ్లూరుతారు. భారత స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కవాతులో పాల్గొనడం ద్వారా జీవితాశయం నెరవేర్చుకోవాలని ఆశపడతారు. దిల్లీలో జరిగే కవాతులో పాల్గొంటే భారత రక్షణ రంగంలోని సైనిక, వాయు, నావిక దళాల్లో ఉద్యోగం లభిస్తుందనే ఆశతో కెడెట్లు ఆ దిశగా సాధన చేస్తుంటారు. నగరంలోని లాల్‌బహదూర్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు ఏటా దిల్లీలో జరిగే పరేడ్‌లకు ఎంపికవుతూ సత్తా చాటుతున్నారు. ఆగస్టు 15, జనవరి 26న నిర్వహించే పరేడ్‌లో త్రివిధ దళాల కవాతులో మేం సైతం అంటూ పాల్గొంటున్నారు. లాల్‌బహదూర్ కళాశాలకు చెందిన విద్యార్థులు 1976 సంవత్సరం నుంచి 2015 సంవత్సరం వరకు 35 మంది ఎర్రకోటలో నిర్వహించిన కవాతులో కదం తొక్కారు. ఇందులో విద్యార్థినులు సైతం ప్రతిభను చాటారు. 2018 జనవరి 26న నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఇస్లావత్ స్వప్న ఎంపికైంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ విభాగం తరపున ఒకే కెడెట్‌గా స్వప్న ఎంపికవడం విశేషం.

### కఠోర శ్రమతోనే..


ఇస్లావత్ స్వప్న లాల్‌బహదూర్ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఎన్‌సీసీ ఎయిర్ వింగ్‌లో కెడెటుగా శిక్షణ పొందింది. ఈమె స్వస్థలం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం కొండాపూర్ గ్రామం. ప్రస్తుతం హన్మకొండ సుబేదారి ప్రాంతంలో ఉంటున్నారు. తండ్రి గోపీ ఆటోడ్రైవర్, తల్లి గృహిణి సునీత, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. స్వప్న విద్యార్థి దశ నుంచే ఎన్‌సీసీపై మక్కువ పెంచుకుంది. చదువుతో పాటు ఎన్‌సీసీలో ఎయిర్ వింగ్ విభాగం శిక్షణలో చురుగ్గా పాల్గొంది. కఠోరమైన శ్రమతో ప్రస్తుతం దిల్లీలోని ఎర్రకోటలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైంది. ఎల్బీ కళాశాల ఎయిర్ వింగ్ ఆఫీసర్ బి.ప్రభాకర్ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో శిక్షణ పొందింది.

● 2018 జనవరి 26న జరిగే భారత గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కవాతు చేసేందుకు ఎంపికైన తర్వాత ఎన్‌సీసీ తెలంగాణ ఎయిర్ వింగ్ బాలికల విభాగం ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని పోలో గ్రౌండ్‌లో శిక్షణ పొందుతోంది. నెల రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణ జనవరి 22వ తేదీ వరకు ఉంటుంది. అనంతరం స్వప్న నేరుగా దిల్లీకి చేరుకుంటుంది. గణతంత్ర దినోత్సవ పరేడ్ ముగిసిన తర్వాత ఫిబ్రవరి ఒకటో తేదీన భారత రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌తో తోటి కెడెట్లతో కలిసి భేటీ అవుతుంది. అప్పటి వరకు దిల్లీలోనే కేంద్ర ప్రభుత్వ అతిథిగా ఉంటుంది. ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని పోలో గ్రౌండ్‌లో కఠినమైన శిక్షణలో ప్రతిభను చాటుతోందని కళాశాల ప్రిన్సిపల్, ఎన్‌సీసీ అధికారులు తెలిపారు.

### గతంలో 35 మంది కెడెట్లు...

● దిల్లీలోని ఎర్రకోట మైదానంలో జరిగే స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల పరేడ్‌లో లాల్‌బహదూర్ కళాశాలకు చెందిన విద్యార్థులు 1976 నుంచి 2015 వరకు 35 మంది పాల్గొన్నారు. వీరంతా పరేడ్‌లో కదం తొక్కారు. వివిధ విన్యాసాలను విజయవంతంగా పూర్తి చేశారు.

● 1976 సంవత్సరంలో మొట్టమొదటిసారిగా పి.విద్యాసాగర్ ఎర్రకోట పరేడ్‌లో పాల్గొన్నాడు. అనంతరం వెంకటేశ్వర్, రాములు (1978), 1988లో కె.సురేశ్‌రాజు, రాజేశ్వర్, వీరేశం, 1989లో శ్రీనివాసులు, కుమారస్వామి (1991), సుభాషిణి (1992), 1995లో శ్రీధర్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాసాచారి (1996), 1998లో వజీద్ హుసేన్, నర్సింగరావు, మురళీ, 1999లో భాస్కర్,రాజు, 2000లో యశోద, నితీష్‌చందర్, అనిల్‌కుమార్, ఉమ్మి సల్మా (2002), కృష్ణకుమార్ (2003), కవిత (2004), రవీందర్‌నాయక్ (2006), స్వర్ణలత (2006), 2007లో సునీల్‌కుమార్, వెంకట్‌నాయక్, దివ్య (2008), మల్లికార్జున్ (2009), శ్రీధర్ (2011), శన్న బేగం (2011), 2012లో ప్రశాంత్, మౌనికా, రాము (2013), సోని (2015) పరేడ్‌కు హాజరయ్యారు. ప్రస్తుతం 36వ క్యాడెట్‌గా స్వప్న పరేడ్‌కు హాజరవుతోంది.



ఇంటి ఆవరణలోని చెట్టుపై..

# ప్రగతినగర్ @ పిచ్చుకల ఆవాసం

## ఓ దంపతుల పోషణతో వేలాదిగా వృద్ధి

న్యూస్‌టుడే, జనగామ

పిచ్చుకలపై జనగామలో ఓ కుటుంబం ప్రేమాస్త్రాన్ని సంధించింది. దీంతో గడిచిన ఆరేళ్లలో కాలనీలో వాటి సంఖ్య.. వేలల్లో పెరిగింది. పక్షి ప్రేమికులు, పర్యావరణ వేత్తలు, ప్రకృతి ఆరాధకులు పిచ్చుక జాతి అంతరించి పోతోందని ఆందోళన చెందుతున్న తరుణంలో.. జనగామలోని ప్రగతి నగర్ కాలనీ పిచ్చుకలకు ఆవాసంగా మారింది.

**రెండు పిచ్చుకలతో మొదలై:** జనగామ ప్రగతి నగర్ నివాసులు టి.యాదగిరి సంధ్యారాణి దంపతులు, 2011లో కాలనీలో ఇల్లు కట్టుకునే సమయంలో రెండు పిచ్చుకలు అప్పుడప్పుడు ప్రహరీపై వాలడం చూశారు. దీంతో సంధ్యారాణి కాసిన్ని బియ్యం వేయగా, రెండు మూడు రోజులు అనుమానంతో చూసిన ఆ పక్షులు, అనంతరం తినడం ప్రారంభించాయి. ఈ విషయాన్ని నర్మెట్ట మండల కేంద్రంలో జడ్పీ పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భర్త యాదగిరికి తెలియజేసింది. దీంతో పర్యావరణ ప్రేమికుడైన ఆయన తన ఇంటికి వచ్చే పిచ్చుకలను కాపాడేందుకు తనకు చదువు చెప్పిన ఓయూ ప్రొఫెసర్ ఎంఆర్ లూ(ఎంఆర్ శ్రీనివాసులు)ను ఆశ్రయించారు. ఆయన వాటి కోసం ఇచ్చిన రెండు గూళ్లను ఇంటి పక్కనే చెట్టుకు ఏర్పాటు చేసినా, ఫలితం కలగలేదు. సంధ్యారాణి క్రమం తప్పకుండా బియ్యం, ఆహారం వేస్తుండటంతో వాటికి నమ్మకం కుదిరింది.. రెండు కాస్తా పదులయ్యాయి. అనంతరం వందలు, వేలుగా వృద్ధి చెందాయి. కాలనీ వాసులకు అవగాహన కల్పించడంతో ఎవరూ వాటికి హాని చేయడం లేదు. వారూ తమకు వీలైనప్పుడల్లా పిచ్చుకలకు ఆహారం అందజేస్తున్నారు.



ఇంటి గోడపై పిచ్చుకలు

### రోజుకు రెండు కిలోలు



యాదగిరి-సంధ్యారాణి దంపతులు తమ కుటుంబానికి అవసరమయ్యే బియ్యం కంటే, పిచ్చుకలకే ఎక్కువగా బియ్యాన్ని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు రెండు కిలోల వరకు ఆహారంగా అందజేస్తున్నారు. నూకలు పెడితే తినడం లేదని చెబుతున్నారు. వరికోత యంత్రాల డబ్బాల్లో మిగిలిన ధాన్యాన్ని, పల్లెలకు వెళ్లినప్పుడు పిచ్చుకల గురించి చెప్పి.. వారు నుంచి ధాన్యాన్ని సేకరించి ఆహారంగా ఇస్తున్నారు. పొరుగూరుకు వెళ్లాల్సి వస్తే, కాలనీలోని ఇతరులకు సమాచారం ఇచ్చి ఆహారం, నీరు ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయమై సంధ్యారాణి మాట్లాడుతూ.. పిచ్చుకలు ఒక పట్టాన ఎవరినీ నమ్మవన్నారు. ఇప్పుడు తాను ఆహారం వేస్తుంటే బెదరడం లేదన్నారు. యాదగిరి మాట్లాడుతూ.. జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ పరిధిలో పక్షులు, ప్రాణులను కాపాడాలని కోరుతున్నారు.

# విద్యుదాఘాతంతో రైతు మృతి

**పోతిరెడ్డిపల్లి(రాయపర్తి), న్యూస్‌టుడే:** విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలం పోతిరెడ్డిపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సజ్జనపు శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతిరెడ్డిపల్లికి చెందిన మందపూరి శ్రీనివాస్(40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం పంటకు నీళ్లు పెట్టేందుకు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. మోటార్ స్విచ్ వేయగా ఆన్ కాలేదు. సమీపంలోని విద్యుత్తు నియంత్రిక వద్ద ఏబీ స్విచ్ ఆఫ్‌లో ఉందనుకొని ఆన్ చేసేందుకు ప్రయత్నించాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. ఆయన భార్య యాకాంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మృతుడు శ్రీనివాస్

## రోడ్డు ప్రమాదంలో ఒకరు..

**అప్పరాజుపల్లి (గూడూరు), న్యూస్‌టుడే:** గోవిందాపురం సమీపంలోని పాకాలవాగులో పడి అప్పరాజుపల్లికి చెందిన బండిరాజు మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. అప్పరాజుపల్లికి చెందిన రాజు శనివారం మహబూబాబాద్‌కు వెళ్లి పనులు ముగించుకుని రాత్రి తిరిగి అప్పరాజపల్లికి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి గోవిందాపురం సమీపంలోని పాకాలవాగులో పడిపోయింది. ద్విచక్ర వాహనంతో రాజువాగులో పడిపోవడాన్ని గమనించిన గ్రామస్థులు అంబరీశ్, శ్రీనివాస్‌లు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అదే రాత్రి రాజును ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు మృతిడి భార్య స్వప్న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మృతదేహానికి పంచనామా నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కూమారుడు ఉన్నాడు.

# మేడిమడుగు బూటకపు ఎన్‌కౌంటర్

## మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రాజు

**పెద్దఎల్లాపురం (గంగారం), న్యూస్‌టుడే:** టేకులపల్లి సమీపంలోని మేడిమడుగు వద్ద జరిగిన సీపీ బాట ఎన్‌కౌంటర్ బూటకమని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి బాదావతు రాజు పేర్కొన్నారు. ఆదివారం గంగారం మండలం పెద్దఎల్లాపురం గ్రామంలోని సీపీబాట రెండు జిల్లాల కార్యదర్శి బోయిన ఓంప్రకాశ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. దళంలో ఓంప్రకాశ్ చేరడానికి కారణం ఏమిటని ఓంప్రకాశ్ భార్య చంద్రకళను మానవహక్కుల నేతలు అడగగా కొత్తగూడలోని ప్లాటు సమస్యతో వారిని కలవడానికి పోయిఉంటడు తప్ప దళంతో నా భర్తకు ఎలాంటి సంబంధాల్లేవని ఆమె చెప్పారు. అంతకుముందు కూడా రెండు సార్లు వారిని కలిసి భూ సమస్యను పరిష్కరించాలని సీపీబాట అన్నలను కలిశారని పేర్కొంది. అనంతరం రాజు మాట్లాడుతూ.. సీపీ బాట నక్సల్స్‌ను పోలీసులు పట్టుకుని అతి కిరాతకంగా కొట్టిచంపి ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌పై సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మృతదేహాలను సీసీ కెమెరాల నీడలో పోస్టుమార్టం చేయాల్సి ఉండగా సాధారణ పద్ధతిలో నిర్వహించడానికి కారణాలు బయటకు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈయన వెంట మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, వెంకటరమణ, రమేశ్ ఉన్నారు.


ఓంప్రకాశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రాజు తదితరులు

## ఈటీవీలో ఈనాడు

**ఉదయం**

05-45: స్పెషల్ ఆరాధన: పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి నూతన ఆంగ్ల సంవత్సర దివ్యాశీస్సులు 06-30: అన్నదాత, 07-00: ఈ టీవీ న్యూస్, 07-30: స్పెషల్ శుభమస్తు: 2018 - రాశిఫలాలు జనవరి '1'న పాటించాల్సిన ముఖ్య నియమాలు... 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఇట్స్ – టైమ్‌టు పార్టీ 2018: (స్పెషల్ ఈవెంట్)

**మధ్యాహ్నం**

12-00: స్పెషల్ తెలుగు'రుచి': సింగర్ భైరవి ముఖ్య అతిథిగా న్యూ ఇయర్ స్పెషల్ వంటలు 'చికెన్ మసాలా రైస్', 'కీమా ఉండల కుర్మా', 'చికెన్ సాతే', 'ప్లమ్‌కేక్' తయారుచేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు. 01-00: స్పెషల్ స్టార్ మహిళ (మెగా గేమ్ షో) టీవీ తారల సరదా ఆటల సందడి 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: ఢీ–10 (రిపీట్), 06-00: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనె మనసులు (డైలీ సీరియల్).

**రాత్రి**

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలితో సరదాగా: హీరోయిన్ కేథరిన్‌తో... 10-30: సినీవారం (స్పెషల్‌ప్రోగ్రాం)

## ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

| | |
|---|---|
| 12:00 | జబర్దస్త్ రిమిక్స్ |
| 01:00 | టాప్స్ రిపీట్ |
| 01:30 | పటాస్ రిపీట్ |
| 02:00 | అల్లరే అల్లరి రిపీట్ |
| 02:30 | సరదాగా కాసేపు రిపీట్ |
| 03:00 | తారక్ మామా అయ్యోరామ రిపీట్ |
| 03:30 | సినిమా చూపిస్త మావ రిపీట్ |

సాయంత్రం

| | |
|---|---|
| 04:30 | నా షో నా ఇష్టం |
| 05:00 | జిల్ జిల్ జిగా |
| 06:00 | అమృతం రిపీట్ |
| 06:30 | ఎక్స్‌ప్రెస్ రాజా |

రాత్రి

| | |
|---|---|
| 07:00 | ఇట్స్ టైం టు పార్టీ ఈవెంట్ |
| 09:00 | పటాస్ |
| 10:00 | నేను..తను |
| 10:15 | ప్రేమిస్తే చుక్కలు చూపిస్తా |
| 10:30 | పోవే..పోరా రిపీట్ |
| 11:30 | ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్ |

## ఈటీవీ లైఫ్

- ★ మానస: మోహమాటం అధిగమించే మార్గాలు (ఉ.6:00, రా. 11.30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా. 10:30)
- ★ గెట్ సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 6:30, రా. 10:00)
- ★ అమృతం: న్యూట్రీ నట్స్ (ఉ.8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ. 1:30)
- ★ ఆయుష్: 1. మూలిక:- అర్జున చెక్క, 2. పథ్యాహారం:- కడుపులో వాయువులు పోవడానికి, 3. జీవన విధానం:- దినచర్య-ఋతుచర్య (ఉ. 9:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్: మహిళల్లో గుండె జబ్బులా? ఎలా అడ్డుకుందాం? (మ. 2:00, రా. 7:00)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ. 10:00)
- ★ అంతరంగం: కొత్త సంవత్సరంలో తీసుకునే సంకల్పాలను... మీరు మధ్యలోనే వదిలేయకుండా ఉండాలంటే ఏం చేయాలి? (మ. 2:30, రా. 09:30)
- ★ అందరికి ఆరోగ్యం: బ్రెయిన్ స్ట్రోక్ (ఉ. 10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. నూతన సంవత్సరం - ఆరోగ్య సంకల్పాలు, 2. పూర్ణాయుషుకు పోషకాహారం, 3. లాలాజలం.. ఓ దివ్యౌషధం (మ. 3:00, రా. 09:00)
- ★ డా. ఈటీవి: కిడ్నీ - మూత్ర వ్యవస్థ సమస్యలు (ఉ.11:00)
- ★ డా. ఈటీవి: నాడీ వ్యవస్థ సమస్యలు (ఉ.11:15)
- ★ డా. ఈటీవి: గుండె ఆరోగ్యం (మ. 3:30, రా. 7:30)
- ★ డా. ఈటీవి: చర్మ సంరక్షణ (మ. 3:45, రా. 7:45)

## ఈటీవీ సినిమా

**నూతన సంవత్సరం సందర్భంగా సరదా చిత్రమాలిక**

ఉదయం: 6-00: టెలీషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: గిరిజా కల్యాణం (శోభన్‌బాబు, జయప్రద) 10-00: మార్నింగ్ షో: పుష్పక విమానం (కమలహాసన్, అమల) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: చిత్రం భళారే విచిత్రం (నరేశ్, రాజీవి) సాయంత్రం: 4-00: ఈవినింగ్‌షో: కొంటెకాపురం (చంద్రమోహన్, అశ్వని) రాత్రి: 7-00: ఫస్ట్‌షో: సూర్యవంశం (వెంకటేశ్, మీనా) 10-00: స్వరాభిషేకం (స్పెషల్ ఎపిసోడ్).

## ఈటీవీ అభిరుచి

ఉ.6.00: జబర్దస్త్ నరేష్ తో "భళా మిస్టర్ బ్రహ్మచారి" - ఫ్లోటింగ్ రమ్ బాల్, ష్రంప్ కాక్‌టైల్ & ఛీజీ చెర్రీ పైనాపిల్, ఉ.6.30: మజారే - సీరియల్ ఆర్టిస్ట్ నంద కిషోర్ ఫ్యామిలీ, ఉ.7.30: బ్రేక్ ఫాస్ట్ షో - రసమలై & సోయా మష్రూమ్ కర్రీ, ఉ.8:00, రా.9.00: సీరియల్ యాక్టర్ శ్రీవాణి తో "బ్రేక్ ఫాస్ట్ షో" - టూటీ ఫ్రూటీ మఫిన్స్ & కాలీఫ్లవర్ క్రష్ పిజ్జా, ఉ.8.30: అతిథి - మీ ఇంటింటి నేస్తం, ఉ.9.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో, ఉ.11.00, రా.10.00: మ్యూజిక్ డైరెక్టర్ భోలె షావలి & సింగర్ వరం తో "గోరు ముద్దలు" - పైనాపిల్ & సగ్గుబియ్యం ఖీర్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ - కోవా జామున్, ఉ.11.30, రా.8:00: సీనియర్ ఆర్టిస్ట్ విశ్వేశ్వరావు తో గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జార్దా రైస్ & బాదం లడ్డు, మ.12.00: గేయరచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు గారితో "టేస్ట్ ఆఫ్ ఇండియా" - బాజ్రా & వాల్‌నట్ పాన్‌కేక్స్, మ.12.15, రా.10.15: జబర్దస్త్ ఆర్టిస్ట్ బుల్లెట్ భాస్కర్ తో "మమ్మీస్ కిచెన్" - పాల్ బన్, మ.12.30, రా.8.45: చెఫ్ విక్రమ్‌సింహ తో "సూపర్ చెఫ్" - పాలకూర ఛాట్, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - పండ్లతో ఛాట్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్శీ క్యూసైన్) - స్విస్ చాక్లెట్ కేక్, మ.1.30, సా.5.30: ఇండియన్ ఐడల్ సింగర్ రేవంత్ తో చటపట (అత్తమ్మ రుచుల స్పెషల్) - స్వీట్‌కార్న్ పాయసం, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ కర్రీ & హలీం, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - స్వీట్ రోల్స్, మ.2.45, రా.10.30: ఎట్‌హోమ్ - డార్క్ చాక్లెట్ క్యాండీ & పైనాపిల్ కేక్.

## ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 $^0$, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 $^0$, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ స్థిరమన్ గణేష్ ఆలయం, సిరసపల్లి, విశాఖపట్నం, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 $^0$, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

## ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 $^0$, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 $^0$, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ అరుళ్ మెగుమకోళ వినాయగర్ దేవస్థానం, పాండిచ్చేరి, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 $^0$, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).



# టమాటాలో కుళ్లు తెగులు నివారణ

**యా**సంగిలో టమాటాలో పాటించాల్సిన మెలకువలను ఉద్యానాధికారులు తెలిపారు. నీరు అధికంగా పారిస్తే.. టమాటా మొక్కలు కిందికి వంగుతాయి. కాయలు బరువుకు నేలను తాకినప్పుడు కుళ్లు తెగులు వచ్చే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మంచు కురుస్తుండటంతో వచ్చిన పూత నిలదొక్కుకుని పిందెలు గట్టిపడేలా చర్యలు చేపట్టాలి. ఇందుకోసం సిఫారసు చేసిన మోతాదులో గ్రోత్ ప్రమోటర్లు లేదా మల్టికే పంటపై పిచికారి చెయ్యాలి.

★ టమాటా సాగుకు ముందు అదే నేలలో వేసిన పత్తి, కంది పంటలను వేరుకుళ్లు తెగులు ఆశిస్తే.. అది తరువాత వేసిన టమాటాను సైతం ఆశించే ప్రమాదం ఉంది. ఈ తెగులున్న పొలంలో 2, 3 ఏళ్ల వరకు టమాటా సాగు చేయకూడదు.


మల్చింగ్ పద్ధతిలో టమాటా సాగు

## మల్చింగ్‌తో లాభాలు

టమాటా సాగులో మల్చింగ్ విధానంతో అనేక ప్రయోజనాన్నాయి. ఈ పద్ధతిలో చీడపీడలను నియంత్రించటంతో పాటు 40-60 శాతం నీటిని ఆదా చేసుకోవచ్చు.. కలుపు తగ్గి కూలీల ఖర్చు మిగులుతుంది. పంటకు వేసిన ఎరువులు పూర్తిగా సద్వినియోగమవుతాయి. వేరు భాగంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. నీటి తాకిడికి మట్టి కొట్టుకుపోదు. మల్చింగ్ కోసం 30-50 మైక్రాన్ల షీటును వాడుతారు. ఎకరానికి సుమారు రూ.13 వేల వరకు ఖర్చవుతుంది. ఈ ప్లాస్టిక్ షీటును 1.2 మీ. వెడల్పుతో సుమారు 400 మీటర్ల పొడవు వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ పద్ధతిలో సాగుచేసిన రైతులు సాధారణం కన్నా 30 శాతం వరకు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.

– న్యూస్‌టుడే, పూడూరు

# దానిమ్మ సాగులో మెలకువలు

**దా**నిమ్మ పంట సున్నితమైనది. పూత, పిందె, కాయ దశలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. తొలి ఏడాది ప్రతి మొక్కకు బలంగా పెరిగిన నాలుగు కొమ్మలను కాండాలుగా ఉంచాలి. మిగిలిన కొమ్మలను కత్తిరించాలి. 2-3 సంవత్సరాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ కొమ్మలను పెంచి సరైన ఆకారం తీసుకురావాలి. నేలపైకి పాకిన, గుబురుగా పెరిగిన, నీటి కొమ్మలను కత్తిరించాలి. చెట్టుకు విశ్రాంతి ఇచ్చే సమయంలో చివరి కొమ్మలను 10-15 సెం.మీ. పొడవు కత్తిరించి తొలగించాలి. కత్తిరించిన తర్వాత వచ్చిన చిగుర్లలో 2-3 ఉంచి మిగతా చిగుర్లను తీసివేయాలి. ఇలా చేస్తే బలమైన కొమ్మలపై పిందెలు ఏర్పడుతాయి. కాయ పరిమాణం బాగా పెరుగుతుంది. చెట్టుకు 60-80 కాయలు ఉంచి మిగతావి తీసివేస్తే ఉన్న కాయ సైజు, నాణ్యత బాగుంటుంది. కత్తిరింపులకు వాడే కత్తెరలను 1 శాతం సోడియం హైపోక్లోరైట్ ద్రావణంలో శుద్ధి చేయాలి.

**పూత నియంత్రణ:** దానిమ్మకు సంవత్సరం పొడవునా పూత పూసే అలవాటు ఉన్నా, మూడు సీజన్లలో జనవరి-ఫిబ్రవరి, జూన్-జులై, సెప్టెంబరు-అక్టోబరు నెలల్లో ఎక్కువగా పూత వస్తుంది. బాక్టీరియా తెగులు వర్షాకాలంలో ఎక్కువగా ఉంటుంది. సెప్టెంబరు రెండో వారంలో, అక్టోబరు మొదటి వారంలోగాని వచ్చే పూతను నిలపాలి. జూన్ నుంచి నీటి తడులు ఆపేయాలి. ఇలా చేస్తే మొక్కలు ఆకులు రాల్చి నిద్రావస్థలోకి వెళతాయి. ఆ తరువాత కత్తిరింపులు చేయాలి. ఎరువులు వేసి నీటితడులివ్వాలి. మొక్కలన్నీ ఒకేసారి పుష్పిస్తాయి. కాయలు ఫిబ్రవరి, మార్చి నెలల్లో కోతకు వస్తాయి. ఈ కాయలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంటుంది.

**పండ్ల రసాన్ని పీల్చే రెక్కల పురుగులు:** ఇవి పండ్లపై రంధ్రాలు చేసి రసం పీల్చుతాయి. రంధ్రాల్లో శిలీంద్రాలు, బాక్టీరియా చేరి పండ్లు కుళ్లి రాలిపోతాయి. రాలిన పండ్లను ఏరి నాశనం చేయాలి. రాత్రి వేళల్లో దీపాల కాంతికి పురుగులు ఆకర్షితమవుతాయి. హెక్టారుకు ఒక ఫ్లోరోసెంటు బల్బును కాయలు పక్వానికి వచ్చే నెల రోజుల ముందే ఏర్పాటు చేయాలి. ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వెలిగేలా చూడాలి. మలాథియాన్ 1 మి.లీ., ఒక శాతం పంచదారను పండ్ల రసంతో కలిపిన మిశ్రమాన్ని దీపాల కింద పెడితే పురుగులు మిశ్రమంలో పడి చనిపోతాయి. పొలంలో కలుపు మొక్కలు, తోట చుట్టూ ఉన్న ముళ్ల పొదలను, తిప్ప తీగలను తీసివేయాలి. సాయంకాలం సమయంలో పొగపెట్టి పురుగులను నియంత్రించవచ్చు.

**బాక్టీరియా మచ్చ తెగులు:** ఈ తెగులు 27-37 డిగ్రీల ఉష్ణోగ్రత, 70 శాతానికి పైగా గాలిలో తేమ ఉండే పరిస్థితుల్లో తీవ్రంగా ఉంటుంది. తెగులు సోకిన చెట్లకు అంట్లు కట్టడం ద్వారా నర్సరీ దశలోనే ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది.


నివారణ: తెగులాశించిన కొమ్మలలను అంగుళం కింద వరకు కత్తిరించాలి. కత్తెరలను 1 శాతం సోడియం హైపోక్లోరైట్ ద్రావణంలో ఉంచి శుద్ధిచేసి ఉపయోగించాలి. తర్వాత 1 శాతం బోర్డో మిశ్రమాన్ని చెట్లపై పిచికారి చేయాలి. లీటరు నీటికి 200 మి.గ్రా. అగ్రిమైసిన్ లేదా స్ట్రెప్టోసైక్లిన్, కాపరాక్సిక్లోరైడ్ 3 గ్రా. కలిపి పిచికారి చేయాలి. తోటలో పరిశుభ్రత పాటించాలి.



# నయా జోష్



డోర్నకలలో చిన్నారుల కేరింతలు



వరంగల్ అయిదు జిల్లాల్లో ఆదివారం రాత్రి నూతన సంవత్సర సంబురాలు అంబరాన్నంటాయి. 2017కు వీడ్కోలు చెబుతూ 2018కి స్వాగతం పలికారు. కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు. కేకులు కోసి పంచిపెట్టారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

–న్యూస్‌టుడే యంత్రాంగం



హన్మకొండలో...



భూపాలపల్లిలో కేక్ కేస్తూ....



వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురంలో...



వరంగల్ నగరంలో నృత్యం చేస్తున్న యువతులు



మహబూబాబాద్‌లో కేరింతలు కొడుతూ....



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో...



వరంగల్ అర్బన్ హన్మకొండలో...



వరంగల్ అర్బన్ హన్మకొండలో యువత సందడి

# హాయ్! బుజ్జీ!!

# నెలకో పేరు.. పేరుకో కథ!

కొత్త ఏడాది వచ్చేసింది...
కోటి ఆశల్ని తెచ్చేసింది...
కమ్మని కలల్ని పండించేందుకు...
కోరుకున్న లక్ష్యాల్ని చేరుకునేందుకు...
పన్నెండు నెలల కాలాన్ని మనకందించింది...
అందుకే ఆ నెలల వెనుక
కథలేంటో తెలుసుకుందాం...
పదండి!

'పన్నెండు నెలలతో ఇప్పుడు మనం సహా చాలా దేశాలు ప్రామాణికంగా వాడుతున్నది గ్రెగోరియన్ క్యాలెండర్'



*ఎవరైనా మనల్ని 'ఇంగ్లిష్ నెలల పేర్లు చెప్పు' అని అడిగారనుకోండి. గుక్క తిప్పుకోకుండా జనవరి, ఫిబ్రవరి, మార్చి... అంటూ గడగడా చదువుకుపోతాం. మరి 'ఆ పేర్లు ఎందుకు, ఎలా వచ్చాయి' అని అడిగారనుకోండి? తెలియదన్నట్టు బేల ముఖం పెట్టేస్తాం. అందుకే ఈ కొత్త ఏడాదిలో సరికొత్తగా నెలల పేర్ల గురించి తెలుసుకుందాం.*



### జనవరి

జానస్ అనే రోమన్ దేవుడి పేరు మీద సంవత్సరంలో మొదటి నెలకి జనవరి అనే పేరొచ్చింది. ముందూ, వెనక చూసేలా రెండు ముఖాలతో ఉండే ఈ దేవుడి ప్రతిమను ప్రారంభం, ముగింపులకు ప్రతీకగా చూస్తారు. గాడ్ ఆఫ్ బిగినింగ్స్ అనీ పిలుస్తారు. అందుకే మొదటి నెలకు ప్రారంభాల దేవుడి పేరన్నమాట.

### ఫిబ్రవరి

ప్రాచీన ఇటాలియన్‌లు ఫెబ్రువా అనే దేవుణ్ణి కొలిచేవారు. ఆయనను కొలుస్తూ రోమన్‌లు 'ఫెస్టివల్స్ ఆఫ్ ప్యూరిఫికేషన్' పేరుతో ఈ నెలలో పండగలు జరుపుకొంటారు. దానిలో నుంచే ఈ నెలకు ఫిబ్రవరి అనే పేరొచ్చింది. అన్ని నెలల్లో ఇదే తక్కువ రోజులున్న మాసమన్న విషయం మనకు తెలిసిందే.

### మార్చి

రోమన్ క్యాలెండర్‌లో మొదటిది మార్చి నెలే. వారి యుద్ధ దైవం మార్స్ పేరు మీదిగా దీనికి 'మార్చి' అనే పేరొచ్చింది. ఆయనే మన గ్రహాన్ని సృష్టించాడని వాళ్ల నమ్మకం. అందుకు గుర్తుగా రోమన్ లంతా ఈ నెలలో వరుసగా పండగలు చేసుకుంటారు.

### ఏప్రిల్

ప్రాచీన రోమన్ క్యాలెండర్‌లో నాలుగో నెల ఏప్రిల్. ఏప్రిల్లోస్ అనే లాటిన్ పదం నుంచి ఈ నెలకీ పేరు వచ్చింది. గ్రీకుల ప్రేమ దేవత అఫ్రో డైట్ పేరు మీదా ఈ పేరొచ్చిందని మరో కథ ప్రచారంలో ఉంది.

### మే

గ్రీకు పురాణాల్లో మయ్యా అనే దేవత ఉంటుంది. గౌరవం, మర్యాదలకు ప్రతీకగా ఆమెను కొలుస్తారు. వసంత కాల దేవతగానూ ఆమెను పూజిస్తారు. ఆమె పేరు మీదనే ఈ ఐదో నెలకు 'మే' అనే పేరొచ్చింది.

### జూన్

జునో అనే ప్రాచీన రోమన్ దేవత పేరు మీద ఈ నెలకు 'జూన్' అనే పేరొచ్చింది. రోమన్‌లు ఆమెను ఇంటి దేవతగా కొలుస్తారు. పెళ్లిళ్ల నెలగా దీనికి పేరుంది.

### జులై

అన్ని నెలల పేర్లు దేవతలు, దేవుళ్ల పేర్ల మీద వస్తే ఈ మాసం పేరు మాత్రం ఓ రాజకీయవేత్త పేరుమీదొచ్చింది. రోమన్ రాజకీయవేత్త జులియస్ కేసర్ గౌరవార్థం ఈ నెలకీ పేరు. ఎందుకంటే ఆయన ఈ సమయంలో పుట్టినందుకట.

### ఆగస్ట్

మొదటి రోమన్ ప్రభువుగా అగస్టస్‌ని చెబుతారు. ఆయన పేరు మీదనే ఈ నెలకు 'ఆగస్ట్' అనే పేరొచ్చింది. అంతకు ముందు ఈ నెలను 'సెక్స్టిలిస్' అని పిలిచేవారట. దానర్థం ఆరోది అని. రోమన్ క్యాలెండర్‌లో ఇది ఆరో నెల.

### సెప్టెంబర్

సెప్టెమ్ అనే లాటిన్ పదం నుంచి సెప్టెంబరు అనే పదం వచ్చింది. అంటే ఏడోది అనర్థం. రోమన్ క్యాలెండర్‌లో ఈ నెల ఏడోది. అయితే జులియన్, గ్రెగోరియన్ క్యాలెండర్లలో మాత్రం తొమ్మిదో నెలగా ఉంది.

### అక్టోబర్

'ఒక్టో' అనే లాటిన్ పదం నుంచి 'అక్టోబర్' అనే పదం వచ్చింది. దానర్థం ఎనిమిది. రోమన్ క్యాలెండర్‌లో ఇది ఎనిమిదో నెలగా ఉంటుంది. అయితే మన జులియన్, గ్రెగోరియన్ క్యాలెండర్లలో మాత్రం ఇది పదో మాసం.

### నవంబర్

'నవెమ్' అనే లాటిన్ పదం నుంచి 'నవంబర్' నెలకు ఆ పేరొచ్చింది. రోమన్ క్యాలెండర్‌లో ఇది తొమ్మిదో నెలగా ఉంది. అయితే మన క్యాలెండర్‌లో మాత్రం పదకొండో నెల.

### డిసెంబర్

లాటిన్ పదం 'డిసెమ్' నుంచి మన పన్నెండో నెలకు 'డిసెంబర్' అనే పేరొచ్చింది. డిసెమ్ అనే పదానికి అర్థం పది. ఇది రోమన్ క్యాలెండర్‌లో పదో నెలగా ఉంటుంది. అందుకే దానికా పేరు. మనకు మాత్రం ఇది పన్నెండో నెల.

## ఆశావహ దృక్పథం

చిరునవ్వు ప్రతికూల పరిస్థితుల్నీ అవకాశాలుగా మార్చేస్తుంది
- చార్లీచాప్లిన్

## నేర్చుకుందాం!

meter = ఓ కొలత, మీటర్
metre = ఛందస్సు, గణము

## సబ్జెక్ట్ ల్యాబ్ - తెలుగు

### గుణింతాల ఆట

ఆధారాలతో 'గ' గుణింతంలోని అక్షరాన్ని నింపితే పదాలు అర్థవంతమవుతాయి.

| | | | |
|---|---|---|---|
| 1. మర్యాద | ☐రవం | 6. పక్షి నివాసం | ☐డు |
| 2. ఛత్రం | ☐డుగు | 7. ఏనుగు | ☐జం |
| 3. ఆవు | ☐వు | 8. ఆలయం | ☐డి |
| 4. విజయం | ☐లుపు | 9. కొండ | ☐రి |
| 5. ఇల్లు | ☐హము | 10. ఏనుగు | ☐జం |

- బి. రామకృష్ణ, సౌత్‌మోపూరు

## ఐదు తేడాలు కనుక్కోండి





మా చిరునామా:
హాయ్‌బుజ్జీ విభాగం, ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్, పిన్‌కోడ్ - 501 512
email: hb.eenadu@gmail.com

జవాబులు: సబ్జెక్ట్ ల్యాబ్ - తెలుగు : 1.గౌ 2.గొ 3.గో 4.గె 5.గృ 6.గూ 7.గ 8.గు 9.గి 10.గ
ఐదు తేడాలు కనుక్కోండి : ఎలుగుబంటి నోరు, కాలు, నాలుక, చేప, మేఘం

# స్వరక్షణ.. సమాజ పరిరక్షణ


## ప్రజలు, పోలీసుల సమన్వయంతోనే నేరాలకు చెక్

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే

**నూతన సంవత్సరంలో చాలామంది తమకున్న చెడు అలవాట్లను దూరం చేసుకోవాలని అనుకుంటారు. గతంలో ఎదురైన దుర్ఘటనలు మళ్లీ రాకుండా ఉండాలని ఆశిస్తుంటారు. కొత్త సంవత్సరంలో మార్పుతో అడుగుపెట్టాలని అనుకుంటుంటారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసులు కీలకపాత్ర పోషిస్తుంటారు. ఇప్పటి వరకు పోలీసు శాఖాపరంగా తీసుకున్న చర్యలతో నేరాలు తగ్గుతున్నాయి. ప్రజలు కూడా తమ బాధ్యతగా అప్రమత్తతతో ఉంటే నేరాలను మరింత తగ్గించే అవకాశముందని పోలీసు ఉన్నతాధికారులు అంటున్నారు. మన భద్రత మనం చూసుకుంటూ నేరాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇలా చేస్తే శాంతియుత సమాజాన్ని నిర్మించవచ్చు. గతేడాది పోలీసు కమిషనరేట్ పరిధిలో నేరాలు, ప్రమాదాల వివరాలను తెలుపుతూ నూతన సంవత్సరంలో ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై 'న్యూస్‌టుడే' కథనం .**

### దొంగతనాలకు ఇలా కళ్లెం

**గతేడాది చోరీలు 408**



సాధారణంగా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లిన సమయంలో, రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లే సమయంలో చైన్ స్నాచింగ్ లేదా దృష్టి మరల్చి దోపిడీలు చేయడం ఇలా పలు రకాల చోరీలు జరుగుతాయి. వీటిలో కొద్దిపాటి అప్రమత్తత పాటిస్తే వీటి నుంచి సులువుగా బయటపడే అవకాశముంది.

**పోలీసుల సలహాలు, సూచనలు :** కమిషనరేట్ పరిధిలో ఎవరైన ఊరికి వెళ్లే సమయంలో సంబంధిత పోలీసు స్టేషన్లలో సమాచారమిచ్చి వెళ్లాలి. ఇంటి ముందు డోర్‌కు తాళం వేసిన కనిపించకుండా కర్టెన్ వేయాలి. విలువైన బంగారు నగలు, వస్తువులను బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలి. అప్పుడప్పుడు చూస్తూ ఉండమని పక్కింటి వారికి చెప్పాలి. రోడ్డుపై వెళ్లేటప్పుటు జాగ్రత్తగా ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు ఆభరణాలు ఎక్కువగా వేసుకోకపోవడం మంచిది.

### అప్రమత్తతతోనే అత్యాచారాలకు అడ్డుకట్ట



**గతేడాది ఘటనలు 51**

అత్యాచారానికి గురైన వారిలో ఎక్కువగా మైనర్లు ఉన్నారు. మైనర్ల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అత్యాచారానికి పాల్పడుతుంటారు. మరికొందరు మహిళలు అవగాహన లేకపోవడంతో ఎదుటి వ్యక్తులు చెప్పిన మాటలను నమ్మి మోసపోయిన సందర్భాలు ఉన్నాయి. తెలిసి తెలియని వయసులో చేసిన పొరపాటుకు జీవితాంతం నరకాన్ని అనుభవించాల్సిన పరిస్థితి ఉంటుంది. ధైర్యంగా ఉంటే ఇలాంటి వాటిని సులువుగా ఛేదించేందుకు అవకాశముంది.

**అవగాహన అవసరం :** పిల్లలపై పెద్దల పర్యవేక్షణ ఉండాలి. ఎప్పటికప్పుడు వారు ఏం చేస్తున్నారో తెలుసుకోవాలి. ప్రతి విషయాన్ని పిల్లలతో చర్చించాలి. ఏది మంచి, ఏది చెడు అనే విషయాలను వారికి వివరించాలి. ఇలాంటి సంఘటనలు జరిగిన సమయలో వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలి. పలు సాక్ష్యాలను సేకరించి నిందితులకు శిక్ష పడే విధంగా పోలీసులు కేసులు నమోదు చేస్తారు. ఇతరులను నమ్మి మోసపోవద్దు.

### నేరాల నియంత్రణ

**దోపిడీలు 15**

**గతేడాది హత్యలు 58**

సమాజంలో హత్యలు క్షణికావేశంలో జరుగుతుంటాయి. గతేడాది హత్యలు, మహిళా హత్యలు, దోపిడీలు ఎక్కువగా జరిగాయి. ఏదైన సంఘటన జరిగిన సమయంలో కొద్ది పాటి సమయనం పాటిస్తే వీటి నుంచి సులువుగా బయటపడే అవకాశముంది. నగరంలో కొంతమంది పని పాట లేకుండా తిరుగుతూ గ్యాంగ్‌గా ఏర్పడి పలు దోపిడీలు చేశారు. క్షణికావేశంలో పలు హత్యలు జరిగాయి. ఇలాంటి వాటిని సులువుగా నియంత్రించి నేరాల శాతాన్ని చాలా వరకు తగ్గించే అవకాశముంది.

**ఆలోచనే ముఖ్యం :** చాలా వరకు క్షణికావేశంలో హత్యలు జరుగుతుంటాయి. పాత కక్షలు, పగలు ప్రతీకారం తీర్చుకునేందుకు పలువురు హత్యలు చేస్తుంటారు. వీటిని ఆలోచనతో అదుపులో పెట్టుకుంటే చాలావరకు తగ్గించే అవకాశం ఉంటుంది. పోలీసులు గతంలో కంటే ప్రస్తుతం పెట్రోలింగ్‌ను పెంచారు. దీనిని మరింత పెంచాల్సిన అవసరముంది. విజుబుల్ పోలీసింగ్ కనిపిస్తుంది. చాలా వరకు నేరాలను తగ్గించే అవకాశముంది. స్నేహపూర్వక పోలీసింగ్ కొనసాగిస్తూ నేరాల నియంత్రణకు పోలీసులు కృషి చేస్తున్నారు. దోపిడీలు గతేడాది వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురు ముఠా సభ్యులు పలు దోపిడీలు చేశారు. దీనిపై కమిషనరేట్ పోలీసులు ప్రత్యేక



దృష్టి పెట్టి వారిని గుర్తించి వారిపై పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపించింది. నగర శివారులలో ప్రేమికులు వెళ్లిన సమయంలో వారిని బెదిరించి వారి నుంచి డబ్బులు బంగారు నగలు, విలువైన వస్తువులను దోపిడీ చేశారు. ప్రస్తుతం ఆ ముఠా జైలులో ఉంది.

### వేధింపులను ప్రతిఘటించాలి

**గతేడాది ఘటనలు 565**



నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలన్నీ రంగాలలో రాణిస్తున్నారు. కానీ విద్యార్థినులు, ఉద్యోగిణులు పని చేసే ప్రాంతంలో కొన్ని ఇబ్బందులకు గురవుతున్నారు. కొంతమంది కామాంధులు పిల్లలను లక్ష్యంగా చేసి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఈవ్‌టీజింగ్‌లు, వేధింపులు, వరకట్న వేదింపులు ఇలా మహిళలు సమస్యలను ఎదుర్కొంటున్నారు.

**రక్షణ చట్టాలు ఇలా :** మహిళలకు వేధింపుల నుంచి విముక్తి పొందేందుకు అనేక రకాల చట్టాలున్నాయి. వీటిని సమర్థంగా ఉపయోగించుకుంటే వారికి పూర్తి స్థాయిలో రక్షణ కలుగుతుంది. పోలీసు శాఖాపరంగా హాక్‌ఐ యాప్ ఉంది. షీ బృందాలు ఉన్నాయి. మహిళలు ఏదైన వేధింపులకు గురైన సమయంలో చాలావరకు బయటకు చెప్పుకోరు. కానీ ఇలాంటి సంఘటనలు జరిగిన సమయంలో మహిళలు రక్షణ చట్టాలు పోలీసుల సేవలను ఉపయోగించుకుంటే సత్ఫలితాలుంటాయి. మహిళలను ఎవరైన వేధిస్తే కమిషనర్ వాట్సాప్ నెంబర్ (94910 89257)కు సమాచారం ఇవ్వవచ్చు. దీనిపై పోలీసులు నిఘాను ఏర్పాటు చేసి వేధింపులు, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటారు.

### రోడ్డు ప్రమాదాల నివారణ ఇలా..

**గతేడాది ఘటనలు 1076**



రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారికి జరుగుతున్నాయి. చాలా వరకు ప్రాణాలు కోల్పోతున్నారు. చిన్నచిన్న పొరపాట్లతో పెద్ద మూల్యం చెల్లించుకోవలసిన పరిస్థితి ఉంటుంది. మద్యం తాగి నడపడం, మితిమీరిన వేగం, రహదారులపై గుంతలు, వాహనంపై పట్టులేకపోవడం, మైనార్లు వాహనాలను నడపడం లాంటి పరిస్థితులతో రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి.

**పోలీసుల మార్గదర్శకాలు :** రోడ్డుపై వాహనాలను నడిపే సమయంలో ట్రాఫిక్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కార్లు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలి. వాహనం నడిపే సమయంలో పూర్తి ఏకాగ్రత వాహనంపై ఉండాలి. మద్యం తాగిన తర్వాత వాహనం నడపకుండా ఉండాలి. హైస్పీడ్ వాహనాలను నడిపే ముందు పూర్తి స్థాయిలో శిక్షణ తీసుకోవాలి. అతి వేగంగా వెళ్లకుండా చూసుకోవాలి. ప్రధానంగా యువత దీనిపై దృష్టి సారించాలి. తల్లిదండ్రులు పిల్లలకు వాహనమిచ్చే సమయంలో అన్ని కాగితాలు ఉంటేనే ఇవ్వాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు.

## రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధి హంటర్‌రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి చెందారు. సుబేదారి పోలీసులు తెలిపిన ప్రకారం... దర్గా కాజీపేటలో నివాసముంటున్న ఎం.నారాయణ నర్సంపేట ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు దర్గా కాజీపేట నుంచి వరంగల్ బస్టాండ్‌కు వెళ్లి అక్కడ ద్విచక్ర వాహనం ఉంచి నర్సంపేటకు బస్‌లో వెళ్లి విధులు ముగించుకొని తిరిగి వరంగల్ బస్టాండ్‌కు వచ్చి ఇంటికి వచ్చేవారు. రోజు వారి మాదిరిగానే ఆదివారం రాత్రి నర్సంపేటలో విధులు ముగించుకొని వరంగల్ బస్టాండ్‌కు వచ్చి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా హంటర్‌రోడ్డులో సీఎస్ఆర్ గార్డెన్ సమీపంలో టిప్పర్ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సుబేదారి పోలీసులు మృతి చెందిన నారాయణను పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఆయన బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నారాయణ మృతి చెందడంతో వారి కుటుంబ శోకసముద్రంలో మునిగిపోయింది. ఎక్సైజ్ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

## పదోన్నతుల రెండో జాబితా విడుదల

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** వరంగల్ రేంజ్‌లో 2007, 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్సైలకు తెలంగాణ ప్రభుత్వం సీఐలుగా పదోన్నతులు కల్పించింది. వారం రోజుల క్రితం 27 మందికి పదోన్నతులు కల్పించి వారికి వివిధ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా శనివారం రాత్రి డీపీసీ పదోన్నతులు కల్పించి నార్త్ జోన్‌కు కేటాయించారు. వారికి నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో కొంతమందిని వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు అటాచ్ చేయగా మరి కొంతమందికి భూపాలపల్లి జయశంకర్ జిల్లా, మహబూబాబాద్‌తోపాటు ఇతర జిల్లాలలో పోస్టింగ్‌లు ఇచ్చారు.

వరంగల్ కమిషనరేట్ పరిధిలో..

| పేరు | ప్రస్తుతం | పదోన్నతి బదిలీ స్థానం |
|---|---|---|
| బురుగు వెంకట్రావ్ | సుబేదారి ఎస్సై | అనిశా |
| పి. దయాకర్ | జీఆర్‌పీ కాజీపేట | వరంగల్ కమిషనరేట్ |
| ఎం. సంజయ్ | సిద్దిపేట కమిషనరేట్ | వరంగల్ కమిషనరేట్ |
| వి. వేణుమాధవ్ | సీఐడీ | వరంగల్ కమిషనరేట్ |
| మహ్మద్ సాధిక్ పాషా | పీటీసీ వరంగల్ | జైనూర్ (ఆదిలాబాద్) |
| బి. కుమారస్వామి | పీటీసీ వరంగల్ | వరంగల్ కమిషనరేట్ |
| ఎన్. వెంకట్రాం | వరంగల్ సిటీ | వరంగల్ కమిషనరేట్ |
| ఎ. శ్రీనివాస్ | సీఐడీ | వరంగల్ కమిషనరేట్ |
| డి. రవిరాజ్ | ఇంతేజార్‌గంజ్ | వరంగల్ కమిషనరేట్ |
| జె. రామకృష్ణ | ట్రాన్స్‌కో | వరంగల్ కమిషనరేట్ |
| ఎండీ సాదుల్లా బాబా | వరంగల్ సిటీ | వరంగల్ కమిషనరేట్ |
| కె. సుజాత | వరంగల్ సిటీ | వరంగల్ కమిషనరేట్ |
| డి. విశ్వేశ్వర్‌రావు | వరంగల్ సిటీ | వరంగల్ కమిషనరేట్ |
| డి. మల్లేశ్ | వరంగల్ సిటీ | వరంగల్ కమిషనరేట్ |
| వి. క్రాంతి కుమార్ | వరంగల్ సిటీ | అనిశా |
| ఎ. రాఘవేందర్‌రావు | కాజీపేట ట్రాఫిక్ | వరంగల్ కమిషనరేట్ |
| ఎండీ అన్వర్ | వరంగల్ సిటీ | వరంగల్ కమిషనరేట్ |
| జయశంకర్ భూపాలపల్లి.. | | |
| వి. వినయ్‌కుమార్ | జయశంకర్ భూపాలపల్లి | ఎస్‌బీ-2 భూపాలపల్లి |
| జి. నరేశ్ | భూపాలపల్లి | పోలీసు కంట్రోల్ రూం భూపాలపల్లి |
| ఒదెల వెంకటేశ్ | భూపాలపల్లి | ఎస్‌బీఐ భూపాలపల్లి |
| కె. శివప్రసాద్ | జయశంకర్ భూపాలపల్లి | ఎస్‌బీ భూపాలపల్లి |
| మహబూబాబాద్ జిల్లా.. | | |
| కె.తిరుపతి | వరంగల్ కమిషనరేట్ | డీసీఆర్‌బీ మహబూబాబాద్ |
| కె.శ్రీను | మహబూబాబాద్ | పోలీసు కంట్రోల్‌రూం మహ-బాద్ |
| డి.రమణమూర్తి | మహబూబాబాద్ | సీసీఎస్ మహబూబాబాద్ |
| బి.ఉపేందర్‌రావు | మహబూబాబాద్ | డీసీఆర్‌బీ జగిత్యాల |

## కమిషనరేట్ పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకాలు



సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, నాగయ్య, శివకుమార్

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పోలీసు సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకం, సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం పతకాలను ఇచ్చింది. వీరిని పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు అభినందించారు. ఉత్తమ సేవా పతకం పొందిన వారిలో సీసీఎస్ ఎస్సై సుబ్రహ్మణేశ్వర్ రావు, సేవా పతకం పొందిన వారిలో ఆర్ఐ నాగయ్య, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ కె.శివకుమార్ ఉన్నారు. వీరికి నగదు బహుమతితోపాటు నెల నెల వేతనంలో కూడా స్వల్పంగా డబ్బులు జమ అవుతాయి. పోలీసుశాఖలో విశేష సేవలందించిన వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వీటిని అందిస్తుంది.

## ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతులు

**వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే:** వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతులు కల్పిస్తూ పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్సైల నుంచి ఎస్సైలుగా పదోన్నతి పొందిన వారిలో ఆరుగురు ఉన్నారు. ఎస్.కుమారస్వామి (ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం కొడకండ్ల), కె.ఎల్లయ్య (మట్టెవాడ), ఎం.మల్లారెడ్డి (మామునూరు), ఎం.అరవిందచారి (మహబూబాబాద్), బి.కవిరాజ్ (వరంగల్ ట్రాఫిక్), ఎ.కట్టమల్లు (నెక్కొండ).

# చూపిస్తాం మార్పు

## నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం

### కొత్త ఏడాదిపై ఇదీ శాసనసభ్యుల మాట

‘అభివృద్ధికి, రాజకీయాలకు విడదీయలేని సంబంధం ఉంది. రాజకీయ నాయకులే మనకు ప్రజా ప్రతినిధులుగా ఉంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. ప్రజల జీవనంలో మార్పు లేదని ఎప్పుడూ వినిపిస్తుంటుంది. ఈ ప్రతికూల వాతావరణం కొత్త ఏడాదిలో కానరాకూడదని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఐదుగా విడిపోయి కొంత ప్రగతి కానవస్తున్నా.. నియోజకవర్గాల్లో పరిస్థితులు ఏమాత్రం మారలేదని ప్రజలంటున్నారు. ఈ నేపథ్యంలో నూతన సంవత్సరంలో ఏమి చేయబోతున్నారంటూ అందుబాటులో ఉన్న శాసనసభ్యుల ఎదుట ‘ఈనాడు’ కొన్ని ప్రశ్నలను ఉంచింది. వారేమి చెప్పారంటే..’

– న్యూస్‌టుడే యంత్రాంగం

## ప్రశ్నావళి

- ప్రజలకు ఇచ్చిన హామీలను కొత్త సంవత్సరంలో ఏ మేరకు నెరవేరుస్తారు?
- 2018లో ప్రధానంగా ఏ పని చేయాలని నిర్ణయించుకున్నారు?
- పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి మీ ప్రణాళిక ఏమిటి?
- 2017లో తీపి-చేదు జ్ఞాపకాలు ఏమిటి?



### సమస్యలు లేని నియోజకవర్గంగా చేస్తా

**సిరికొండ మధుసూదనాచారి, సభాపతి, భూపాలపల్లి**

ప్రజలు అడగని హామీలు కూడా నెరవేర్చాం. నియోజకవర్గంలో 25 ఏళ్లుగా కాని అభివృద్ధి మూడేళ్లలోనే చేసి చూపించాను. అవసరమైన సమస్యలను గుర్తించి పరిష్కరించడమే ధ్యేయం

సాగునీటికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అన్ని మండలాలకు సాగునీరును అందించేందుకు కృషిచేస్తాను. దేవాదుల ఎత్తిపోతలతో చెరువులు నింపడం, రూ. 60 కోట్లతో ఎస్సారెస్పీ 38 డీబీఎం ద్వారా నియోజకవర్గంలోని పలు గ్రామాలకు నీళ్లు అందించేందుకు కృషిచేస్తాను.

నియోజకవర్గానికి మాత్రం 3,500కు పైగా రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేయించాను. నూతన సంవత్సరంలో 2వేల ఇళ్లకు పైగా పూర్తిచేసేందుకు కృషిచేస్తున్నా.

ప్రపంచ తెలుగు మహాసభలకు నియోజకవర్గంలోని 150 మంది సంచార జాతులవారిని తీసుకెళ్లాను. ఎప్పుడూ హైదరాబాద్ చూడనటువంటి వారిని తీసుకెళ్లాను. కుందన్‌భాగ్‌లో వారికి వంటలు చేయించి స్వయంగా నేను, నా కుటుంబసభ్యులతో కలిసి భోజనాలు వడ్డించాను. ఇది చాలా సంతృప్తినిచ్చింది.



### మరో వెయ్యి ఇళ్లు తెస్తా

**అజ్మీరా చందూలాల్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి , ములుగు**

రైతులకు ఇచ్చిన హామీలకంటే ఎక్కువగా పనులు చేశాం. రైతులకు రుణమాఫీ, ఇతర ప్రభుత్వ పథకాల అమలు సజావుగా అమలయ్యేలా చూస్తా.

ములుగు బస్‌స్టేషన్ విస్తరణపై దృష్టిసారిస్తా. ప్రయాణికులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతాం. నియోజకవర్గానికి మరో 1000 రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషిచేస్తాను.

రెండు పడక గదుల ఇళ్లు 2500 పైగా మంజూరు చేయించాను. ఈ సంక్రాంతికి 500 ఇళ్లకు పైగా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వచ్చే సంక్రాంతికల్లా మిగతా ఇళ్లు పూర్తిచేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా.

నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాల అమలు సంతృప్తి నిచ్చింది. కేంద్రం అమలు చేసిన జీఎస్టీ బిల్లుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది అసంతృప్తిగా అనిపించింది.



### హామీలు పూర్తిస్థాయిలో నెరవేరుస్తా

**-అరూరి రమేశ్, వర్ధన్నపేట**

ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో తీర్చటంతోపాటు ప్రజల, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రణాళికబద్ధంగా పని చేస్తా.

మిషన్ కాకతీయ పథకం ద్వారా నియోజకవర్గంలో ఉన్న చెరువు, కుంటలను మరమ్మతులు చేసి ప్రతి ఎకరాకు నీరందించేందుకు ముందుకు సాగుతున్నా. పర్వతగిరి మండలం చింతనెక్కొండ, చౌటపల్లి గ్రామాల మధ్య ఏళ్లతరబడి ఉన్న రోడ్డు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా.

గ్రామాల్లో ప్రభుత్వ భూములు లేకపోవడంతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని అధిగమించి అన్ని గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నా.

ఎస్ఆర్ నగర్‌లో 792 ఇళ్లు నిర్మించాలనుకున్నాం. కేవలం 210 ఇళ్లు మాత్రమే నిర్మించగలిగా. ఇది నిరుత్సాహం కలిగించింది.



### పెద్దన్నలా ఉంటా

**ఎర్రబెల్లి దయాకర్‌రావు, పాలకుర్తి**

అన్ని హామీలను తీరుస్తాను. ఆపదొస్తే పెద్దన్నలా సాయం చేయడానికి అన్నివేళలా సిద్ధంగా ఉంటా.

చెన్నూరు జలాశయాన్ని పూర్తి చేసి సాగునీటి కష్టాలు లేకుండా చేస్తాను. రూ.22 కోట్లతో నియోజకవర్గం కేంద్రం రూపురేఖలు మారుస్తాను. అండర్ గ్రౌండ్ డ్రైనేజీతోపాటు నాలుగువైపులా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి కృషి చేస్తాను.

నియోజకవర్గానికి 3600 ఇళ్లు మంజూరవగా, 1500 నిర్మాణంలో ఉన్నాయి. కొత్త సంవత్సరంలో అన్నీ పూర్తి చేసి పేదలకు అందిస్తాను.

దేవాదుల ద్వారా గోదావరి నీళ్లు తీసుకురావడం తీపి జ్ఞాపకంగా భావిస్తాను. 42 చెరువులు, కుంటలు నీళ్లతో నింపి రైతులకు యాసంగి కష్టాలు లేకుండా చేశా. అభివృద్ధిలో కొందరు అవినీతి, అక్రమాలకు పాల్పడుతుండటం చేదు జ్ఞాపకం.



### ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తా

**డీఎస్.రెడ్యానాయక్, డోర్నకల్**

నేనెప్పుడు హామీలు ఇవ్వను. ప్రజలకు అవసరమైందేమిటనేది తెలుసుకుని ఎప్పటికప్పుడు ఒక ప్రణాళిక ప్రకారం నెరవేరుస్తా. కొత్త సంవత్సరంలోనూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తా.

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకొచ్చి ఎస్సారెస్పీ కాలువల ద్వారా నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు నింపడమే. ప్రతి గ్రామానికి, తండాకు తారు రోడ్డు సౌకర్యం కల్పించడమే లక్ష్యం. మిషన్ భగీరథ కింద ఇంటింటికీ నల్లా బిగించి నీరందిస్తాం.

గుత్తేదారులు ముందుకు రాక కొన్ని రకాల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ప్రతికూల పరిస్థితిని అధిగమించి పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి కృషి చేస్తా.

ఉగ్గంపల్లిలో మా ఇంటికి ముఖ్యమంత్రి కేసీఆర్ రావడం. ఆ రోజు ఆయన నాకు దీవించడం మరవలేను. చేదు జ్ఞాపకాలు ఏమీ లేవు. అంతా మంచే జరిగింది.



### పేదల సొంతింటి కల నెరవేర్చుతా

**-బానోతు శంకర్‌నాయక్, మహబూబాబాద్**

ప్రజలకు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చా. ప్రతి తండాకు లింకు రోడ్ల సౌకర్యం కల్పిస్తున్నాను. తండాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాను.

2018లో జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటుచేయాలనుకుంటున్నాను. ప్రభుత్వ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాను. మున్నేరు వాగుపై చెక్‌డ్యాం నిర్మించి మానుకోట ప్రజల తాగు, సాగునీటి కష్టాలను తీర్చుతా. రూ.6.5 కోట్లతో రెడ్యాల ఆనకట్ట అభివృద్ధి పనుల్ని త్వరలోనే ప్రారంభిస్తాం.

ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చుతా. గుడిసెలు లేకుండా చేయడమే లక్ష్యం.

గురుకులాల్ని జిల్లా కేంద్రానికి తెప్పించాం. రెండు జాతీయ రహదారులు తెప్పించాం. మైసమ్మ చెరువు సుందరీకరణ, నిజాం చెరువును మినీ ట్యాంకు బండ్ గా తీర్చిదిద్దనున్నాం.



### ప్రగతి నివేదన యాత్ర చేపడతా

**వినయ్ భాస్కర్, వరంగల్ పశ్చిమ**

నియోజకవర్గంలో ఇచ్చిన హామిలు 65శాతం నెరవేర్చాను.

2018 సంవత్సరంలో ప్రగతి నివేదన యాత్ర చేపట్టాలని నిర్ణయించాను. ప్రభుత్వ పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన పనుల వివరాలను ప్రజలకు వివరిస్తాను.

కొత్తగా వెయ్యి నుంచి పదిహేను వందల రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల కోసం పథక రచన చేస్తున్నా. రెండు స్థలాలను ఎంపిక చేయాలనుకుంటున్నాం. తొలుత న్యూశాయంపేటలో ఇళ్లు నిర్మిస్తాం. రెండో విడతగా స్థలం ఎక్కడ అనువుగా అక్కడే నిర్మాణాలు చేపడతాం.

కాజీపేట ఆర్వోబీ నిర్మాణానికి రూ.75 కోట్లు లభించడం ఆనందంగా ఉంది. నగరానికి అనేక అవార్డులు రావడం సంతోషం. మంత్రి కేటీఆర్ హన్మకొండలో నవంబర్ 18న నిర్వహించిన సభలో నన్ను అభినందించడం మరవలేను. అనిశెట్టి మురళి మరణం చేదు జ్ఞాపకం.



### పూర్తిస్థాయిలో హామీలు తీరుస్తా..

**చల్లా ధర్మారెడ్డి, పరకాల**

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో చాలా వరకు తీర్చగలిగా. కొత్త సంవత్సరంలో మిగిలిన వాటితో పూర్తి స్థాయిలో నెరవేరుస్తా. ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి నాటికి తాగునీటి కోసం గోదావరి నీటిని అందిస్తా.

రైతులు ఏటా రెండు పంటలను పండించాలి. ఆ దిశగా కాళేశ్వరం నీటిని కాల్వల ద్వారా అందించాలని నిర్ణయం తీసుకున్నాం. జూన్ లోపు ఆ జలాలతో చెరువులను నింపేస్తాం.

ప్రభుత్వ భూమి ఉన్న ప్రతి చోటా రెండు పడక గదుల ఇళ్లను నిర్మించేలా చూస్తా.

గత సంవత్సరం నియోజకవర్గంలో టెక్స్‌టైల్ పార్కుకు ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేయడం గొప్ప అనుభూతిని నిలిపింది. ఎమ్మెల్యేగా గెలుపొందటం కంటె ఆ పార్కు శంకుస్థాపన ఎంతో ఆనందాన్ని కలిగించింది. దేశంలోనే అతి పెద్ద పరిశ్రమగా చరిత్రలో నిలిచిపోతుంది.



### ప్రతి ఎకరానికి సాగు నీరు

**రాజయ్య, స్టేషన్‌ఘన్‌పూర్**

మిషన్ భగీరథ పథకం కింద అన్ని గ్రామాల్లో ఇంటింటికీ శుద్ధిజలం, స్టేషన్‌ఘన్‌పూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషిచేస్తాం. స్టేషన్‌ఘన్‌పూర్‌లో 200 రెండు పడకగదుల ఇళ్లు నిర్మించేందుకు కృషిచేస్తా. లింగంపల్లి-మల్కాపూర్ రిజర్వాయర్ నిర్మాణ శంకుస్థాపనకు సీఎంను ఆహ్వానిస్తాం.

దేవాదుల పథకం కింద చేపట్టిన అన్ని రిజర్వాయర్ల నిర్మాణం పనులు పూర్తయ్యేలా కృషి చేస్తాం. ప్రతి ఎకరానికి సాగు నీరందేలా శ్రమిస్తాం.

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి గుత్తేదారులు ముందుకు రావడంలేదు. సమస్యలను అధిగమించి ఎంపికచేసిన గ్రామాల్లో పూర్తిస్థాయిలో రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణానికి కృషిచేస్తా.

జిల్లా ఏర్పాటుపై నియోజకవర్గంలో అక్కడక్కడా వ్యతిరేకత ఏర్పడింది. ఆ తర్వాత సద్దుమణిగింది. ఇది చేదు జ్ఞాపకం. సీఎం కేసీఆర్ మా పనితీరుపై నిర్వహించిన సర్వేలో 4వ ర్యాంకు లభించడం జీవితంలో మరువలేనిది. ఇది తీపి జ్ఞాపకం



### మౌలిక సదుపాయాలు కల్పిస్తా

**ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, జనగామ**

ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పనులు సాధిస్తున్నాను. ముఖ్యమంత్రి కేసీఆర్ అండతో నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాను. జనగామలో రింగు రోడ్డు హామీ నెరవేర్చేందుకు ప్రాధాన్యమిస్తాను.

కొత్త సంవత్సరంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు, వివిధ సేవలు సక్రమంగా అందించేందుకు, సమస్యలు నా దృష్టికి తెచ్చేందుకు ఐటీ సాంకేతికతను వినియోగించేలా ప్రత్యేక ఏర్పాటు చేస్తా.

డబుల్ బెడ్ రూం పథకం పనులు అన్ని చోట్ల ప్రారంభమయ్యేలా చూస్తా. మొదలైనవి పూర్తి చేసేందుకు అధికారులతో గడువు వారీగా సమీక్ష చేస్తా.

2017లో మాత, శిశు సంరక్షణ వైద్యశాల, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి తృప్తినిచ్చాయి. పండ్లున్న చెట్టుకే రాళ్లు- కొన్ని విమర్శలు ఎదురైనా ప్రజలు, కార్యకర్తలు అధినేత సహకారంతో ముందుకు వెళ్తున్నా.

# అమ్మల దర్శనానికి ఇబ్బందులే!

## పార్కింగ్ స్థలాల నుంచి గద్దెల వద్దకు కాలినడకే!


వాహనాల పార్కింగ్ స్థలం నుంచి మేడారానికి కాలినడకన వెళ్తున్న భక్తులు(పాతచిత్రం)

**ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: (తాడ్వాయి, న్యూస్‌టుడే)**

రెండేళ్లకోసారి వచ్చే మేడారం మహా జాతరకు కుటుంబ సమేతంగా వెళ్లి అమ్మల దర్శనం చేసుకోవాలని భక్తులు ఎంతో కుతూహలంతో ఉంటారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, ఎత్తు బెల్లం, తలనీలాలు, ఇతర మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు ఎదురుచూస్తుంటారు. అమ్మవార్ల దర్శనార్థం సుదూరప్రాంతాల నుంచి గంటలకొద్దీ ప్రయాణాలు సాగించి మేడారానికి వస్తుంటారు. ఇక్కడికి రావడానికి తెలుగు రాష్ట్రాల నుంచి ఆర్టీసీ ప్రతి జిల్లా నుంచి వందల కొద్దీ బస్సు సర్వీసులు తిప్పుతుంటుంది. అయినా చాలా మంది భక్తులు ప్రైవేటు వాహనాల వైపే మొగ్గుచూపుతారు. ఎందుకంటే ఇక్కడికి వచ్చే భక్తులు దాదాపుగా మూడు రోజులపాటు ఇక్కడే ఉంటారు. ఇందుకోసం గుడారానికి, వంటసామగ్రి, దుస్తులు, కోళ్లు, మేకలు, ఇతరత్రా సామగ్రితో పిల్లాపాపలతో వస్తారు. ఇందు కోసం ప్రయాణం సాఫీగా సాగాలంటే ప్రత్యేకంగా ప్రైవేటు వాహనాలనే ఆశ్రయిస్తారు. ప్రైవేటు వాహనాల కోసం పార్కింగ్ స్థలాలను కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అమ్మల దర్శనం కోసం కాలినడక తప్పడం లేదు. దీంతో వెంటతెచ్చుకున్న వస్తుసామగ్రితో భక్తులు నడవలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### పాత పార్కింగ్ స్థలంలో మొక్కల పెంపకం

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కాటారం, భూపాలపల్లి, మహాముత్తారం మీదుగా మేడారానికి వస్తారు. ఈ దారుల్లో వచ్చేభక్తులతో పాటు వరంగల్, హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్ నుంచి వచ్చే వారు పస్రా మీదుగా మేడారానికి వస్తారు. ఆయా ప్రాంతాల గుండా వచ్చే ప్రైవేటు వాహనాలను నార్లాపూర్ చింతల్ వద్ద నున్న సుమారు 40 ఎకరాల స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేస్తారు. జాతరకు ముందు రోజు వచ్చేవారికి కొత్తూరు, ఊరట్టం, కన్నెపల్లి, నార్లాపూర్, మేడారంలలోని కొన్నిప్రాంతాల్లో ఏర్పాటు చేసే పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిండిపోతాయి. మంగళ, బుధవారాల్లో ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వారు చింతల్ పార్కింగ్ స్థలంలోనే వాహనాలను నిలపాల్సి ఉంటుంది. అక్కడ వారి వాహనాలను నిలిపి అక్కడి నుంచి అమ్మల దర్శనానికి సుమారు 6 కిలోమీటర్లు నడిచివెళ్తుంటారు. ఇటీవల ఆ స్థలంలో హరితహారంలో భాగంగా అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటారు. అవి ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. దీంతో ఇక ఆ స్థలంలో పార్కింగ్ చేసేందుకు అవకాశం లేదు. ఆ స్థలానికి ప్రత్యామ్నాయంగా వెంగళాపురంలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. వెంగళాపురం నుంచి నార్లాపూర్‌కు 3 కిలోమీటర్లకు పైగా ఉంటుంది. దీనివల్ల అదనంగా మరో మూడు కిలోమీటర్ల కాలినడక పెరుగుతోంది.

### ఆర్టీసీ బస్సుల్లో వచ్చేవారికి ఇబ్బందులుండవు

ప్రైవేటు వాహనాల్లో వచ్చేవారికే ఈ కాలినడక ఇబ్బందులు లేనేలేవు. మేడారంలో ఏర్పాటు చేసే ఆర్టీసీ బస్‌స్టేషన్ అమ్మల గద్దెలకు సమీపంలోనే ఉంటుంది. జంపన్న వాగుకు సైతం కేవలం కిలోమీటర్ దూరంలోనే ఉంటుంది. దీంతో ఆర్టీసీ ప్రయాణికులకు కాలినడక ఇబ్బందులు ఉండవు. బస్సులో వచ్చి నేరుగా అమ్మల దర్శనానికి వెళ్లవచ్చు. అదేవిధంగా మేడారం పరిసర ప్రాంతాల్లోనే విడిదికి అవకాశం ఉంటుంది.

### ఏటూరునాగారం నుంచి వచ్చే వాళ్లకూ ఇదే ఇబ్బంది..

ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి, ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఏటూరునాగారం మీదుగా మేడారం వెళ్లాల్సి ఉంటుంది. ఇటు వైపు నుంచి వచ్చే ప్రైవేటు వాహనాలను ఏటూరునాగారం మండలం చిన్న బోయినపల్లిలో పార్కింగ్ ఏర్పాటు చేస్తారు. అక్కడి నుంచి మేడారానికి 24 కిలోమీటర్లు ఉంటుంది. బస్సులు, లారీలు లాంటి పెద్ద వాహనాలను అక్కడే నిలిపివేస్తారు. చిన్న ఆటోలు, కార్ల లాంటి చిన్నవాహనాలను మాత్రం చెల్పాక, కొండాయి మీదుగా ఊరట్టం వరకు పంపిస్తారు. ఇటునుంచి వెళ్లే వాహనాలను కూడా మార్గం మధ్యలోని అటవీ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలున్న చోట వాహనాలను పార్కింగ్ ఏర్పాటు చేస్తారు. ఆయా ప్రదేశాల నుంచి కూడా కాలినడకతోనే ఊరట్టం నుంచి భక్తులు వెళ్తుంటారు. దీంతో ఆయా ప్రదేశాల నుంచి మేడారానికి వెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పిల్లలు, వృద్ధులతో కలిసివచ్చిన వారు అంతదూరం వెళ్లలేక తిరుగుముఖం పడుతున్నారు. పార్కింగ్ స్థలాల నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతున్నా ఆ సమయంలో బస్సులు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతోపాటుగా వారి పిల్లలు, వృద్ధులు, వస్తుసామగ్రితో అంతదూరం వెళ్లడం కష్టతరమవుతోంది.

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే మేలు

రాష్ట్రాలు, జిల్లాలు దాటి వందల కిలోమీటర్లు ప్రయాణం సాగించి వచ్చి ఇలా పార్కింగ్ స్థలాలు లేక తిరుగుముఖం పట్టే పరిస్థితులున్నాయి. గత జాతరలో చిన్నబోయినపల్లి పార్కింగ్ స్థలం వద్దే విడిది చేసి అటునుంచి అటే చాలామంది భక్తులు వెళ్లిపోయారు. ఈసారి చింతల్ వద్ద మొక్కలు పెంచడంతో వెంగళపూర్‌లో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పార్కింగ్ స్థలాలు కాకుండా మేడారానికి దగ్గరలో ఏర్పాటు చేస్తే ప్రైవేటు వాహనాల్లో వచ్చే భక్తులకు మేలు కలుగుతుంది. దీనిపై అధికారులు దృష్టిసారించాలని భక్తులు కోరుతున్నారు.


ప్రైవేటు వాహనాల్లో మేడారానికి వస్తున్న భక్తులు(పాతచిత్రం)


నార్లాపూర్ చింతల్ పార్కింగ్ స్థలం వద్ద మొక్కలు నాటిన దృశ్యం

# భక్త జనులతో నిండిపోయిన మేడారం

**మేడారం, న్యూస్‌టుడే:** జయశంకర్ జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మ దేవతలను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం సెలవు దినం కావడం, ఏడాది చివరిరోజు కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. హైద్రాబాద్, నల్గొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, గోదావరిఖని, భూపాలపల్లి, మణుగూరు, నర్సంపేట తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు మేడారానికి తరలివచ్చారు. వచ్చిన భక్తులందరూ జంపన్నవాగు ప్రవాహంలో, షవర్ల కింద పుణ్యస్నానాలు చేసి తమ చిన్నారులకు తలనీలాలర్పించారు. వాగుఒడ్డున ఉన్న జంపన్నకు ముడుపులు కట్టారు. ఆ తర్వాత గద్దెల ప్రాంగణానికి వచ్చి ఎత్తుబెల్లం, ఒడిబియ్యం, పూలు పండ్లు, పసుపు కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రద్దీ పెరగడంతో ప్రధాన ద్వారం మూసివేయించిన అధికారులు భక్తులను క్యూలైన్ల ద్వారానే గద్దెల వద్దకు అనుమతించారు.

### అమ్మవార్ల సేవలో త్రిపుర డీజీపీ

వనదేవతలు సమ్మక్క, సారలమ్మ దేవతల సేవలో త్రిపుర డీజీపీ నాగరాజు తరించిపోయారు. బంధుమిత్రులతో కలిసి మేడారానికి వచ్చిన ఆయన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజును దర్శించుకుని బెల్లం, పూలు పండ్లు, నూతనవస్త్రాలు సమర్పించారు. తొలిసారిగా ఆలయానికి వచ్చిన డీజీపీని అధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. వరంగల్ అర్బన్ జిల్లా ఆర్డీవో వెంకటరెడ్డి కుటుంబ సమేతంగా దేవతలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.


సమ్మక్కదేవతకు పూజలు చేస్తున్న త్రిపుర డీజీపీ నాగరాజు

# పోరాట యోధుడు వెంకటేశ్వర్లు

**నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే:** మహబూబాబాద్ ప్రాంతంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించిన పోరాట యోధుడు తలారి వెంకటేశ్వర్లు అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయ్‌సారథి అన్నారు. ఆదివారం స్థానిక వివేకానంద సెంటర్‌లో తలారి వెంకటేశ్వర్లు 5వ వర్థంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మదిర ప్రాంతంలో జన్మించి మానుకోటకు వచ్చిన ఆయన సీపీఐలో చేరి అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని ఆయన తెలిపారు. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి. అజయ్, పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, దాస్యం రామూర్తి తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లుకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

# 17న ఆదివాసీ తెగల సమ్మేళనం

**నెహ్రూసెంటర్(మానుకోట),న్యూస్‌టుడే:** ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 17న మేడారం సమ్మక్క-సారలమ్మ ప్రాంగణంలో జరిగే ఆదివాసీ తెగల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో జరిగిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. పడిగిద్దల రాజు, జంపన్నలు కాకతీయులకు వ్యతిరేకంగా పోరాడి అసువులు బాశారన్నారు. మేడారం జాతర ధర్మకర్త మండలి కమిటీ ఛైర్మన్‌తో పాటు డైరెక్టర్‌గా ఆదివాసీలనే నియమించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు అవగాహన కల్పించేందుకు జనవరి 6న గూడూరులో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కొట్టెం ముఖర్జీ, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లల సంక్షేమానికి కృషి చేయాలి


అనాథ పిల్లలకు వస్తువులు పంపిణీ చేస్తున్న సినీ నటి గీతాసింగ్

**నర్సంపేట, న్యూస్‌టుడే:** అనాథ పిల్లల అభ్యున్నతికి, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమవంతు తోడ్పాటు అందించాలని ప్రముఖ నటి గీతాసింగ్ అన్నారు. నర్సంపేటలోని మార్కండేయ కాలనీలో శ్రీరాజరాజేశ్వర అనాథ ఆశ్రమంలో 'షాపింగ్ ఫర్ పూర్' కోసం ఆదివారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనాథ పిల్లలకు చేయూతనివ్వడమంటే దైవానికి సేవ చేయడంతో సమానమన్నారు. అనాథ పిల్లలను చేరదీసి వారి అభివృద్ధికి పాటుపడుతున్న నిర్వాహకులను అభినందించారు. అనంతరం బిట్స్ కళాశాల విద్యార్థులు అందజేసిన వస్తువులను పిల్లలకు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు శివానంద్, నటి విజయదుర్గ పాల్గొన్నారు.

# గురుకులంలో స్పీకర్ బస

**భూపాలపల్లి, న్యూస్‌టుడే**: భూపాలపల్లిలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల విద్యాలయంలో ఆదివారం రాత్రి స్పీకర్ మధుసూదనాచారి బస చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కోశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్పీకర్ భోజనం చేశారు. మున్సిపాలిటీ ఛైర్మన్ సంపూర్ణ, వైస్ ఛైర్మన్ గణపతి, వార్డు కౌన్సిలర్లు భాస్కర్, అనిల్, నారాయణ, ముంజాల నిర్మల, వజ్రమణి, శిశు సంక్షేమ శాఖ అర్గనైజర్ భారతమ్మ, గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ సత్యనారాయణ, మైనారీ సలహాదారుడు అక్బర్ , తెరాస నాయకులు సంపత్, రమేష్, రవీందర్‌రెడ్డి, తదితర మైనార్టీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న స్పీకర్

# చిన్న కాళేశ్వరం.. ఇక వేగిరం!

## ఎత్తిపోతల రెండో దశకు అటవీ శాఖ అనుమతి

## 45 వేల ఎకరాల ఆయకట్టుకు లబ్ధి

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి:, (కాళేశ్వరం, న్యూస్‌టుడే)

**కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ఎక్కువ భాగం మంథని నియోజకవర్గం పరిధిలోకే వస్తుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పాటు కన్నెపల్లి, సిరిపురం పంప్‌హౌస్‌లు ఈ నియోజకవర్గంలోనే నిర్మిస్తున్నారు. ఇంతపెద్ద ప్రాజెక్టు కడుతున్నా దీని ఫలాలు మాత్రం ఇతర ప్రాంతాలకే తరలివెళ్తున్నాయనే ఆవేదన ఇక్కడి రైతుల్లో ఉంది. ప్రాజెక్టుకు భూములిచ్చి సహకరిస్తున్నా ఆ నీరు మా పొలాల్లోకి రావడం లేదనే చిన్న బాధ ఉండేది. ఆ బాధను తొలగిస్తూ కాళేశ్వర, ముక్తీశ్వర(చిన్నకాళేశ్వరం) ఎత్తిపోతల పథకంతో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు మహర్దశ సంతరించుకోనుంది.**



ఇటీవల చిన్నకాళేశ్వరం పథకం పనులు పరిశీలిస్తున్న భారీనీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు

### 45 వేల ఎకరాలకు సాగునీరు

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మహదేవపూర్, కాటారం, మహాముత్తారం, మల్హర్‌రావు, పలిమెల మండలాలల్లోని 14 చెరువుల నిర్మాణంతో పాటు 79 కిలోమీటర్ల పైపు లైను ద్వారా సుమారు 40 గ్రామాలకు సాగు నీరందించేందుకు ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. మొత్తం 45 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ప్రణాళికలు కూడా సిద్ధం చేశారు. అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి సెప్టెంబర్ 9, 2008న భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. రూ.499 కోట్ల అంచనా వ్యయంతో పనులు ఆరంభించారు. ఈ పథకం పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వేగం పుంజుకోగా, అదే సమయంలో అటవీ అనుమతులు, భూసేకరణ వేగవంతం కాకపోవడంతో తీవ్ర జాప్యం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా పనుల్లో వేగం పెరగలేదు. కాంగ్రెస్ నాయకులు జానారెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నాల లక్ష్మయ్య పలుమార్లు పరిశీలించి నిర్మాణాలను చేపట్టాలని డిమాండు చేశారు. ఒక వైపు అటవీశాఖ అనుమతులు లేక, మరో వైపు భూసేకరణ పూర్తి కాక పనులు నిలిచిపోయి ఎత్తిపోయినట్లేనని భావించారు. ఈ నేపథ్యంలో భారీ నీటి పారుదల శాక మంత్రి హరీశ్‌రావు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి పథకం పేరును పలకడానికి అనుగుణంగా చిన్నకాళేశ్వరంగా సంబోధించారు. వెంటనే పనులను వేగవంతం చేయాలని ఆదేశించడంతో పథకానికి గ్రహణం వీడినట్లయిందని పలువురు భావిస్తున్నారు. మే, జూన్ వరకు పూర్తి చేయాలని ఆదేశించడంతో ఐదు మండలాల రైతన్నలకు సాగునీటి కష్టాలు తీరినట్లే.

**తొమ్మిదేళ్ల ఎదురుచూపులకు తెర..**

కాళేశ్వర, ముక్తీశ్వర ఎత్తిపోతల పథకం సాగునీటి కోసం ఈ ప్రాంత రైతులు తొమ్మిదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. వారి కలలు నెరవేరే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. ఎప్పటినుంచో పనులకు మోక్షం కలగక మూలనపడిన ఈ పథకాన్ని ఎట్టకేలకు భారీ నీటి పారుదల శాఖ మంత్రి పరిశీలించటంతో పనుల్లో వేగం పుంజుకోనుంది. దీనికంటే ఇటీవలే ప్రారంభమైన కాళేశ్వర ప్రాజెక్టు పనులు శరవేగంగా నడవడంతో రైతులు కాస్త నిరాశ చెందారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు రాదని, కాళేశ్వర, ముక్తీశ్వర పథకం ముందుకు సాగదని ఒకింత నిరాశకు గురయ్యారు. ఎత్తిపోతల పథకం పనులు తిరిగి తొమ్మిదేళ్లకు షురూ కానుండడంతో ఈ ప్రాంత అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### 365 రోజులు నీటి లభ్యత

చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి 365 రోజుల పాటు నీరు అందుబాటులో ఉండనుంది. పాత పద్ధతిలో మాత్రం కేవలం వర్షాకాలం సమయంలోనే నీరు ఎత్తిపోసేందుకు అవకాశం ఉండేది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద సుమారు 50 కిలోమీటర్ల మేర బ్యాక్‌వాటర్ ఉంటుంది. అందువల్ల నీటి లభ్యత ఏడాది పొడవునా ఉండనుంది. అవసరమున్నప్పుడు ఈ నీరందించడానికి వీలు కలుగుతుంది. దీంతో గతంలో ఒకే పంటకే నీటిని అందించాలనుకున్నారు. ఈ బ్యాక్ వాటర్‌తో రెండు పంటలకు నీరందించనున్నారు. ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టుకంటే ముందే దీనిని పూర్తిచేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

### తొలగిన అడ్డంకులు

కొంతకాలంగా రెండోదశ అనుమతులు రాకపోవడం వల్ల పనుల్లో జాప్యం ఏర్పడింది. గతంలోనే అటవీ శాఖ అనుమతుల కోసం కేంద్రానికి విన్నవించుకున్నారు. మంత్రి హరీశ్‌రావు పర్యటించిన రోజే రెండో దశ అటవీ అనుమతులు వచ్చాయని ఆయనే ప్రకటించారు. అటవీ అడ్డంకులు తొలగాయని మంథనికి మంచి రోజులు రానున్నాయని చెప్పారు. మొత్తం 146 ఎకరాలకు రెండో దశ అటవీ అనుమతులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కొంతమేర పనులు సాగాయి. ఇక మిగిలిన పైపు లైను పనులు, చెరువుల నిర్మాణం పనులు ఊపందుకోనున్నాయి.



బీరసాగర్ వద్ద నిర్మితమవుతున్న చిన్నకాళేశ్వరం ఎత్తిపోతల పథకం

## కోటలో సందర్శకులకు అదనపు ఆహ్లాదం



కోటలో కొత్తగా ఏర్పాటు చేసిన స్ప్రింక్లర్లు

**ఖిలావరంగల్, న్యూస్‌టుడే:** జిల్లాలో పర్యటక కేంద్రంగా విరాజిల్లుతున్న ఖిలా వరంగల్ కోట ప్రాంతంలో సందర్శకులకు అదనపు ఆహ్లాదాన్ని పంచేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. కేంద్ర పురావస్తు శాఖ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో మధ్యకోట కళాతోరణాల నడుమ పచ్చని గడ్డిని పెంచడంతో పాటు వివిధ రకాల పూల మొక్కలను పెంచుతున్నారు. ఇటీవల శిల్పాల మధ్య నిత్యం నీటి జల్లులతో గడ్డిని తడిపి పచ్చగా ఉంచేందుకు స్ప్రింక్లర్లను ఏర్పాటు చేశారు. నిత్యం పర్యటకులతో రద్దీగా ఉండే కోటలో కాకతీయుల కాలం నాటి కట్టడాలతోపాటు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు శ్రీకారం చుట్టారు.



## కనులపండువగా శివ పార్వతుల కల్యాణం

### ఆకట్టుకున్న శోభాయాత్ర

**గిర్మాజీపేట, న్యూస్‌టుడే:** శివ మహా పురాణంలో భాగంగా ఆదివారం వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులోని మహేశ్వరి గార్డెన్‌లో శివ పార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రుషిపీఠం సత్సంగం, విద్యారణ్య ఆర్షధర్మ రక్షణ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బహ్మశ్రీ డాక్టర్ సామవేదం షణ్ముఖ శర్మ, భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు వేద మంత్రోచ్చారణల మధ్య తోట కిషన్‌రావు, చాముండేశ్వరి ఆదిదంపతుల కల్యాణాన్ని జరిపించారు. వేల మంది భక్తులు పాల్గొని శివ పార్వతుల నామస్మరణతో తరించారు. కల్యాణం అనంతరం ఉత్సవ మూర్తులకు మంగళహారతులుఇచ్చారు. షణ్ముఖశర్మ అనుగ్రహ భాషణం చేస్తూ లోక కల్యాణార్థం, సమాజహితం కోసం శివపార్వతుల కల్యాణం నిర్వహించామని చెప్పారు. దీని వల్ల ప్రజల్లో భక్తిభావం పెరిగి హిందూధర్మం, భారతీయ సదాచారం సన్మార్గంలో నడుస్తుందన్నారు. శివ పార్వతుల కల్యాణానికి ముందు వరంగల్ దుర్గేశ్వరస్వామి దేవాలయంలో షణ్ముఖశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను గుర్రపు బగ్గీపై ఉంచి మహేశ్వరి గార్డెన్ వరకు శోభాయాత్ర నిర్వహించారు.



నగరంలో శోభయాత్ర



కల్యాణం అనంతరం శివపార్వతులకు మంగళహారతి ఇస్తున్న భక్తులు